## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం
# మానసిక ప్రశాంతత

- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా
- ప్రియదర్శిని స్టేడియంలో యోగాసనాలు
- ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట


2


# ప్రభాత సమాచారం

https: epaper.prabhathasamacharam.com

ఆదిలాబాద్ Digital Edition

మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

శనివారం | 11 ఏప్రిల్ 2026 | 14 పేజీలు



# దంచికొడుతున్న ఎండలు

11



- ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భానుడి భగ భగలు
- మంచిర్యాలలో రికార్డు స్థాయిలో 42.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు
- పగటి వేళల్లో కర్ఫ్యూను తలపిస్తున్న ప్రధాన వీధులు
- వడగాల్పుల ధాటికి అల్లాడుతున్న జనం
- సింగరేణి గనుల్లో ఎండప్రచండం
- వడగాలుతో వ్యాధుల బారిన వృద్ధులు, చిన్నారులు
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో అగ్నిగోళాన్ని తలపిస్తున్న ఎండల దాటికి మాడులు పగిలే పరిస్థితులు తలపిస్తున్నాయి. అంతకంతకు పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రతాపానికి ప్రమాదకర పరిస్థితులు ఆందోళన కలిగిస్తున్నాయి. వాతావరణంలో మార్పులు చోటు చేసుకోవడంతో భీకరమైన వడగాల్పులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. గత మూడు రోజుల నుండి ఆదిలాబాద్, నిర్మల్ , మంచిర్యాల, ఆసిఫాబాద్ కొమరంభీం జిలాల్లో 42 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతుండటం ఎండల తీవ్రతకు అద్దం పడుతున్నాయి. ఉదయం ఏడు గంటలు దాటితే భానుడు నిప్పులు కక్కుతుండటంతో జనాలు గడపదాటి బయటకు వెళ్లాలంటేనే జనాలు భయపడిపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఆసుపత్రుల్లో చిన్న పిల్లలు, బాలింతలు, రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రధానంగా ఉపాధి హామీ కూలీలు తీవ్ర ఎండతో అస్వస్థతకు గురవుతున్నారు.




4

# చిరువ్యాపారులకు గ్యాస్ సెగ

- మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు!
- ఆకాశాన్నంటిన సిలిండర్ ధరలు
- బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటేనే గిట్టుబాటు
- కట్టెలకు పెరిగిన డిమాండ్..
- క్వింటాల్ ధర రెట్టింపు చేస్తున్న వ్యాపారులు
- నిర్మల్ జిల్లాలో తీరని గ్యాస్ కష్టాలు

ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు, యుద్ధ ప్రభావంతో గ్యాస్ ధరలు సామాన్యులకు గుదిబండలా మారాయి. ధరల భారంతో సామాన్య గృహిణులతో పాటు చిరువ్యాపారులు విలవిల్లాడుతున్నారు. హోటల్, ఆయా తినుబండారాల తయారీదారులు గ్యాస్‌ను కొనలేక, వ్యాపారం సాగించలేక సతమతమవుతున్నారు.

## ఆశ్రమ పాఠశాలలో
# అంతుచిక్కని మరణం

- పరీక్షల వేళ పనపాటర్ గిరిజన ఆశ్రమంలో విషాదం
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమంటున్న తల్లిదండ్రులు
- జైనూర్ మండలంలో విషాదం

గిరిజన బిడ్డల చదువులకు నిలయం కావాల్సిన ఆశ్రమ పాఠశాల ఓ చిన్నారి ప్రాణాలను బలి తీసుకుంది. కొమురం జిల్లా జైనూర్ మండలం పనపాటర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న దుర్వా అన్వేష్ (10) అనుమానాస్పద రీతిలో మరణించడం కలకలం రేపింది.

8


# ఎంపీ, ఎమ్మెల్యేపై కేసు పెట్టాల్సిందే


6

- నకిలీ మ్యాప్‌తో మోసం..
- ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన జోగు రామన్న
- అదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్‌పై చెలరేగిన రాజకీయ దుమారం
- ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపణ

ఎయిర్ పోర్టు మాస్టర్ ప్లాన్ అంటూ విడుదల చేసిన నకిలీ మాస్టర్ ప్లాన్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌లపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఏఎస్పీ మౌనికకు ఎంపీ, ఎమ్మెల్యేలపై ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు అదిలాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇంకా మాస్టర్ ప్లాన్ తయారు కాలేదని వెల్లడించారని తెలిపారు.



# మత విద్వేషాలకు చెక్

- ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్లు డిలీట్
- రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు
- నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెచ్చరిక

# రేపు మంచిర్యాలకు కేటీఆర్ రాక

- క్యాతనపల్లి మున్సిపల్ పాలకవర్గానికి ఆత్మీయం సన్మానం

## ఆదిలాబాద్ ఆర్టీవో
# అధికారులకు జాతీయ అవార్డు



## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం
# మానసిక ప్రశాంతత






- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపు
- ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో యోగాసనాలు
- ప్రగతి ప్రణాళికలో ఆరోగ్య పరిరక్షణకు పెద్దపీట

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. మారుతున్న జీవనశైలిలో పెరుగుతున్న మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు, శారీరక, మానసిక సమతుల్యత సాధించేందుకు యోగా అత్యుత్తమ సాధనమని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక', 'తెలంగాణ రైజింగ్ 2047' కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం ఉదయం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ప్రపంచ హోమియోపతి దినోత్సవం, ఆయుష్ డే సందర్భంగా 'హెల్త్ వీక్' వేడుకలలో యోగా శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ స్వయంగా పాల్గొని ప్రజలు, అధికారులు, విద్యార్థులతో కలిసి యోగాసనాలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, "ఆరోగ్యం కోసం కలిసికట్టుగా.. విజ్ఞానంతో ముందుకు" అనే నినాదంతో ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో కనీసం అరగంట సమయం యోగా లేదా వ్యాయామానికి కేటాయించాలని సూచించారు. ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రగతి ప్రణాళికలో ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. జిల్లాను ఆరోగ్యవంతమైన సమాజంగా తీర్చిదిద్దేందుకు ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. యోగా ద్వారా శరీర దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను కూడా సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, రిమ్స్ డైరెక్టర్ జై సింగ్ రాథోడ్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఇతర అధికారులు, వైద్య సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# సర్కారీ వైద్యంతోనే పేదలకు భరోసా



- ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దు
- దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతితో పరిష్కారం
- ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా నష్టపోకుండా, ప్రభుత్వ ఆసుపత్రుల్లో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని హమాలీవాడ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (యూపీహెచ్‌సీ)లో హోమియోపతి వైద్య పితామహుడు డాక్టర్ శామ్యూల్ హనీమన్ 271వ జయంతిని పురస్కరించుకుని 'ప్రపంచ హోమియోపతి దినోత్సవ' వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్, జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఆయుష్ వైద్య విధానాలైన హోమియోపతి, ఆయుర్వేదం, యునానీ, యోగా ద్వారా దీర్ఘకాలిక వ్యాధులకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా ఎలోపతి మందుల వల్ల దుష్ప్రభావాలు ఎదుర్కొనే వారికి హోమియోపతి ఒక అద్భుతమైన ప్రత్యామ్నాయమని ఆయన వివరించారు. ఈ వైద్యంపై తనకున్న నమ్మకాన్ని పంచుకుంటూ, తన వ్యక్తిగత అనుభవాన్ని గుర్తుచేసుకున్నారు. గర్భిణీ స్త్రీల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, రిమ్స్‌లో అందుబాటులో ఉన్న టిఫా స్కాన్, రెగ్యులర్ చెకప్‌లను వినియోగించుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన శిశువుల జననానికి బాటలు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మధ్యాహ్నం 12 గంటల నుండి 3 గంటల వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని కోరారు. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందుబాటులో ఉంచుకోవాలని హితవు పలికారు. ప్రభుత్వ దవాఖానాలు, బస్తీ దవాఖానాల ద్వారా అందుతున్న ఉచిత సేవలను ప్రతి ఒక్కరూ అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బండారి అనూష, నరేందర్ రాథోడ్, వైద్యులు పాల్గొన్నారు.




## ఈవీఎం గోదామును
## తనిఖీ చేసిన కలెక్టర్ రాజర్షి షా

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

స్థానిక శాంతినగర్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల భద్రతా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి నెల నిర్వహించే సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన గోదామును సందర్శించి, యంత్రాల భద్రతను, నిల్వ గదుల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా గోదాముకు వేసిన సీళ్లను, రిజిస్టర్లను తనిఖీ చేసిన కలెక్టర్.. భద్రతా ఏర్పాట్లపై సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఈవీఎంల భద్రత విషయంలో ఎటువంటి రాజీ పడకూడదని అధికారులను ఆదేశించారు. గోదాం పరిసరాల్లో నిరంతరం పహారా ఉండాలని, అగ్నిమాపక పరికరాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. వర్షం కారణంగా తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, లోపల ఉన్న యంత్రాల రికార్డులను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, ఎన్నికల విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కేబుల్ న్యూస్ జర్నలిస్టులు
## అక్రిడిటేషన్లకు దరఖాస్తు చేసుకోవాలి

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

కేబుల్ న్యూస్ ఛానళ్లలో పనిచేస్తున్న జర్నలిస్టులు రాష్ట్ర జిల్లా స్థాయి అక్రిడిటేషన్ కార్డుల కోసం తక్షణమే దరఖాస్తు చేసుకోవాలని సమాచార, పౌర సంబంధాల శాఖ కమిషనర్ సి.హెచ్. ప్రియాంక ఒక ప్రకటనలో సూచించారు. అర్హత గల జర్నలిస్టులు నిర్ణీత గడువులోగా తమ దరఖాస్తులను సమర్పించాలని ఆమె కోరారు. జిల్లా కేంద్రంగా స్టూడియోలు కలిగి ఉండి, రాష్ట్ర వ్యాప్తంగా లేదా జిల్లాల్లో ప్రసారాలు సాగించే ఛానళ్లు రాష్ట్ర, జిల్లా స్థాయి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. అలాగే, జిల్లా కేంద్రాల్లో స్టూడియోలు కలిగి ఉన్న ఛానళ్లు ఆయా జిల్లాల పరిధిలో అక్రిడిటేషన్ల కోసం నేరుగా దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ వివరించారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తు ఫారంతో పాటు ఈ క్రింది పత్రాలను తప్పనిసరిగా జత చేయాల్సి ఉంటుంది. ఛానల్ పేరు, స్టూడియో పూర్తి చిరునామా. కేంద్ర సమాచార ప్రసార శాఖ జారీ చేసిన సర్టిఫికెట్, లేబర్ లైసెన్స్ కాపీ, ఎంఎస్ఓలతో కుదుర్చుకున్న ఛానల్ ప్లేస్‌మెంట్ అగ్రిమెంట్ పత్రాలు గడువులోగా దరఖాస్తు చేయాలి. ధృవీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను 17వ లోపు సమర్పించాలన్నారు.

## కొత్తగూడెంలో తెలంగాణ
# రైతు సంఘం రాష్ట్ర మహాసభలు

- ఏప్రిల్ 23 నుంచి మూడు రోజుల పాటు నిర్వహణ
- రైతు సమస్యల పరిష్కారమే లక్ష్యం..
- జిల్లా అధ్యక్షులు కొండగుర్ల లింగన్న



**దండేపల్లి, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఈనెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించనున్న తెలంగాణ రైతు సంఘం 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కామ్రేడ్ కొండగుర్ల లింగన్న పిలుపునిచ్చారు. శుక్రవారం దండేపల్లి మండలం తల్లాపేట గ్రామంలో నిర్వహించిన మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని, మహాసభల గోడపత్రిక (పోస్టర్)ను విడుదల చేశారు. ఈ సందర్భంగా లింగన్న మాట్లాడుతూ.. రాష్ట్రంలో రైతాంగం ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర, పంట బీమా, బోనస్ చెల్లింపులు, రైతు భరోసా మరియు బ్యాంకు రుణాల వంటి సమస్యలపై రైతు సంఘం నిరంతరం రాజీలేని పోరాటాలు చేస్తోందని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో కార్మిక, కర్షక హక్కుల రక్షణ కోసం చేపట్టబోయే ప్రజా పోరాటాలకు ఈ మహాసభలు దిక్సూచిగా మారతాయని ధీమా వ్యక్తం చేశారు. కొత్తగూడెంలో జరిగే ఈ ప్రతిష్టాత్మక మహాసభలకు రైతులు, మేధావులు, రైతు శ్రేయోభిలాషులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన కోరారు. వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉన్న తరుణంలో, రైతుల గళాన్ని చాటేందుకు ఈ వేదికను ఉపయోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి మొడతే వెంకటేష్, సహాయ కార్యదర్శి ఎర్రోజుల శ్రీను, మండల ఉపాధ్యక్షులు బొమ్మిడి రాజన్న, మండల కమిటీ సభ్యులు బండారి సురేష్, మద్దికుంట లక్ష్మణ్, ముడిత మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ షాప్‌ను
# వినియోగించుకోండి

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈనెల 17న జిల్లాస్థాయి వర్క్ షాప్ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కే ముత్యంరెడ్డి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించి ఈ వర్క్ షాప్ సమావేశంలో పోలీస్, రెవిన్యూ, వ్యవసాయ శాఖ, కార్మిక శాఖ, తదితర రంగాల్లో బాల కార్మికుల నిర్మూలన, వ్యవసాయ కార్మిక సమస్యలు, బాల కార్మికుల గుర్తింపు రక్షణ, కార్మిక చట్టాలు, బాల బాలికల విద్య తదితర అంశాలపై అంతర్జాతీయ కార్మిక సమైక్య ప్రతినిధులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సభ్యులు చేసుకోవాలని కోరారు.



## ప్రజాపాలన ప్రగతి ప్రణాళికను
# పకడ్బందీగా అమలు చేయాలి

- గడువులోగా ఇందిరమ్మ ఇండ్లు పూర్తి కావాలి
- పొన్నారం, క్యాతనపల్లిలో పనులను పరిశీలించిన మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మందమర్రి, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
ప్రభుత్వం చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మండలం పొన్నారం గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, పారిశుద్ధ్య నిర్వహణ, సి.సి. రోడ్డు నిర్మాణ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణను జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని తెలిపారు. నిరుపేదలకు గూడు డు కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్లు నిర్మించుకునేలా అధికారులు అవగాహన కల్పించాలని, ఇందిరమ్మ ఇండ్లకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులకు వివరించాలని తెలిపారు. అంతర్గత రహదారులు, మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రతిరోజు ప్రతి ఇంటి నుండి తడి, పొడి చెత్తను వేరువేరుగా సేకరించి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని తెలిపారు. వేసవి అయినందున ప్రజలకు త్రాగునీటి సమస్యలు లేకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అనంతరం క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో అమృత్ 2.0 పథకంలో భాగంగా చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణ పనులు, పైప్ లైన్ల ఏర్పాట్లను మున్సిపల్ కమిషనర్ మారుతీ ప్రసాద్, మున్సిపల్ చైర్ పర్సన్ గొడిసెల సంధ్యారాణి లతో కలిసి పరిశీలించారు. పనులు వేగవంతం చేసి త్వరగా పూర్తి చేసేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



# వెంకట్రావుపేట చెరువును 'చిత్తడి నేల'గా గుర్తించేందుకు ప్రతిపాదనలు

- వలస పక్షుల ఆవాసానికి గుర్తింపు కల్పించేలా చర్యలు
- కేంద్ర నిధులతో పర్యాటక అభివృద్ధికి అవకాశ
- మంచిర్యాల జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్





**మంచర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామంలో గల చెరువును చిత్తడి నేలగా ప్రకటించేందుకు రాష్ట్రస్థాయిలో జరగనున్న సమావేశానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్‌లో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్యలతో కలిసి రెవెన్యూ, మత్స్య, నీటిపారుదల, వ్యవసాయ, పర్యాటక శాఖల అధికారులు, సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వెంకట్రావుపేట గ్రామంలోని చెరువు 132 ఎకరాల విస్తీర్ణంలో వ్యాపించి ఉందని, ఈ చెరువు వలస పక్షులకు ప్రపంచ ప్రసిద్ధి పొందిందని తెలిపారు. వలస పక్షులు ఈ ప్రాంతానికి వచ్చి నివాసాలు ఏర్పరచుకుని ఉండడం వలన గుర్తింపు పొందిందని, వలస పక్షులతో పాటు స్థానిక పక్షులకు ఒక సురక్షిత ఆవాస ప్రాంతాన్ని ఏర్పరిచేందుకు ఈ చెరువును చిత్తడి నేలగా ప్రకటించడానికి గ్రామస్తులు, నీటిపారుదల, రెవెన్యూ, మత్స్య, పర్యాటక శాఖల అధికారులకు ఎలాంటి అభ్యంతరం లేదని, చిత్తడి నేలగా ప్రకటించేందుకు తాము అంగీకరిస్తున్నామని తెలియజేశారని వివరించారు. చిత్తడి నేలగా ప్రకటించినట్లయితే కేంద్ర ప్రభుత్వ నిధులు మంజూరు చేయబడతాయని, తద్వారా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జరిగే సమావేశానికి ముందు ప్రతిపాదనలు సమర్పించాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## లక్ష్యం 'అరైవ్-అలైవ్'
# రహదారి భద్రతపై ఉక్కుపాదం

- ఏప్రిల్ 13 నుంచి వారం పాటు
- జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలు
- కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో రహదారి భద్రతపై చేపట్టనున్న 'అరైవ్-అలైవ్' కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హరిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఎస్పీ నితికా పంత్, అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలసి కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని ప్రజాప్రతినిధుల సహకారంతో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని తెలిపారు. ఏప్రిల్ 13: ప్రతి గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించి రహదారి భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14: అంబేద్కర్ జయంతి సందర్భంగా రహదారి భద్రతపై భారీ అవగాహన కార్యక్రమాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలి. ఏప్రిల్ 15: ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులు, తల్లిదండ్రులకు హెల్మెట్ ధరించడం, రహదారి భద్రత నియమాలపై అవగాహన కల్పించాలి. ఏప్రిల్ 16: పెట్రోల్ బంకుల వద్ద "నో హెల్మెట్ -నో పెట్రోల్" బోర్డులు ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 17: ప్రతి పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లు, వాహనదారులకు సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. ఏప్రిల్ 18: మున్సిపాలిటీలు, మండల కేంద్రాల్లో హెల్మెట్, సీటుబెల్ట్ ధరించిన వాహనదారులను విద్యార్థుల ద్వారా అభినందించి పుష్పగుచ్ఛాలు అందజేయాలి. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ఉద్యోగులు, అధికారులు కూడా హెల్మెట్ ధరించడం తప్పనిసరి చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

# ప్రమాదాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం



- బ్లాక్ స్పాట్స్ వద్ద పక్కాగా రక్షణ చర్యలు చేపట్టాలి
- సమీక్షా సమావేశంలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ నితికా పంత్ ఆదేశం

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
జిల్లాలో రహదారి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ హరిత అన్నారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో రెవెన్యూ, పోలీస్, రవాణా, రహదారి భవనాల, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్, జాతీయ రహదారులు, విద్యా, వైద్య, ఆరోగ్యశాఖ, అధికారులతో నిర్వహించిన జిల్లా స్థాయి రహదారి భద్రత కమిటీ సమావేశానికి ఎస్పి నీతికాపంత్,అదనప కలెక్టర్ ఏం. డేవిడ్, సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్ల, ఆర్డీవో లోకేశ్వర్ రావుతో కలిసి కలెక్టర్ హరిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రహదారులు ప్రమాదాలు జరగకుండా అవసరమైన రక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. జాతీయ రహదారికి ఇరువైపులా వున్నా గ్రామాలలో నేషనల్ హైవే అధికారులు, లైటింగ్ ఏర్పాట్లు, సర్వీస్ రహదారిపై స్పీడ్ బ్రేకర్లు, సైడ్ డ్రైన్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. పెట్రోలింగ్ వాహనాలు అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ శాఖ అధికారులు రహదారులకు అడ్డంగా ఉన్నవిద్యుత్తు స్తంభాలు, వేలాడే తీగలను సరి చేయాలన్నారు. రహదారికి ఇరువైపులా ఉన్న విద్యుత్ స్తంభాలకు రేడియం అంటించాలన్నారు. రవాణా శాఖ, అధికారులు, వాహనాలను, స్కూల్ బస్సులను,తనిఖీలు చేపట్టాలన్నారు. రహదారి భవనాల శాఖ, పంచాయతి రాజ్, ఇంజనీరింగ్ ఆధ్వర్యంలో గల రహదారులకు మరమ్మత్తులు, వంతెనల నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రహదారులపై స్పీడ్ బ్రేకర్లు, వేగ నియంత్రణ, సూచిక బోర్డులు, ఏర్పాటు చేయాలన్నారు. ఎక్కడైనా ప్రమాదం జరిగిన వెంటనే క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని మునిసిపాలిటీలలో మండల కేంద్రాలలో వాహనాల రద్దీ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపే వారికి అతివేగంగా, హెల్మెట్, సీటు బెల్టు, ధరించని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. రహదారి నియమాల పై పజలకు అవగాహన పర్చాలన్నారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌డిఓ దత్తారావు, రవాణా శాఖ అధికారి రామచందర్, డిపిఓ భిక్షపతి, ఎస్ఇ విద్యుతు శాఖ ఉత్తం జాడే, పిఆర్ ఇఇ ధర్మేందర్, విద్యా, వైద్య నేషనల్ హైవే అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలి

**మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ చంద్రయ్య**



**భీమిని, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
ప్రజా సంక్షేమంలో భాగంగా నిరుపేదల కొరకు ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరైన లబ్ధిదారులు నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి.చంద్రయ్య అన్నారు. శుక్రవారం జిల్లాలోని భీమిని మండలం రాంపూర్ గ్రామంలో ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లు, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం క్రింద కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్లు పొందిన లబ్ధిదారులు నిబంధనల ప్రకారం నిర్ణీత విస్తీర్ణంలో ఇండ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఉపాధి హామీ పథకం క్రింద జరుగుతున్న పనులలో ఉపాధి కూలీల సంఖ్య పెంపొందించాలని, ప్రతి కుటుంబం 100 రోజుల పని పూర్తి చేసుకోవాలని తెలిపారు. కూలీలతో మాట్లాడుతూ అర్హులైన వారికి ప్రభుత్వం నుంచి గ్యాస్, విద్యుత్ రాయితీ, రేషన్ కార్డులు, పెన్షన్లు అందించడం జరుగుతుందని తెలిపారు. గ్రామంలోని రోడ్డులో అవసరమైన చోట 2 కల్వర్టుల నిర్మాణం చేయాలని అధికారులకు సూచించారు. మల్లిడి గ్రామపంచాయతీని సందర్శించి గ్రామంలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. తదనంతరం గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల ఎత్తు, బరువులను పరిశీలించి, విద్యార్థులకు మంచి ఆహారాన్ని ఇవ్వాలని, గ్రామంలోని బాలింతలు, గర్భిణీలకు పౌష్టికాహార భోజనం, పాలు అందించాలని తెలిపారు. గ్రామంలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించడం జరిగింది. తదనంతరం భీమిని గ్రామపంచాయతీ సందర్శించి గ్రామంలోని అభివృద్ధి పనులను పరిశీలించడం జరిగింది. మండల తహసిల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రాంపూర్, ఇతర గ్రామాలకు సంబంధించి కొంతమంది భూ సమస్యలపై చేసిన ఫిర్యాదులు, రికార్డులు పరిశీలించి అట్టి ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులతో సరిచూసి వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తహసిల్దార్ ను ఆదేశించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని సందర్శించి మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతి వివరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. గంగామోహన్, మండల పంచాయతీ అధికారి మహేష్, హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్, ఎపిఓ సత్యప్రసాద్, ఈసీ రాజేంద్రప్రసాద్, మల్లిడి గ్రామ సర్పంచ్ కర్ణ మమత, బిట్టురుపల్లి గ్రామ సర్పంచ్ పి. దశరథ్, భీమిని గ్రామ సర్పంచ్ శ్రీకాంత్ గౌడ్, టెక్నికల్ అసిస్టెంట్ భార్గవ్, ఉపసర్పంచ్లు, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శులు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.



## కాలభైరవ ఆలయంలో పూజలు

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
జిల్లా కేంద్రంలోని కాలభైరవ ఆలయాన్ని నిర్మల్ మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పల గణేష్ చక్రవర్తి శుక్రవారం సందర్శించారు. ఆలయంలో పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దీప దూప నైవేద్య ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ అడప విజయలక్ష్మి పోశెట్టి, రాజు, గోపి, రామకృష్ణ, హరీష్, నరేష్, రమణ, బద్రి శేఖర్ అడప సాయి కందుల మధు పవన్ విక్రమ్ నాగరాజు దినేష్,శివ నాని తదితరులు పాల్గొన్నారు.

## వర్క్ షాప్‌ను వినియోగించుకోండి

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా కేంద్రంలో కార్మిక శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 17న జిల్లాస్థాయి వర్క్ షాప్ సమావేశం నిర్వహిస్తున్నట్లు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కే ముత్యంరెడ్డి తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించి ఈ వర్క్ షాప్ సమావేశంలో పోలీస్, రెవిన్యూ, వ్యవసాయ శాఖ, కార్మిక శాఖ, తదితర రంగాల్లో బాల కార్మికుల నిర్మూలన, వ్యవసాయ కార్మిక సమస్యలు, బాల కార్మికుల గుర్తింపు రక్షణ, కార్మిక చట్టాలు, బాల బాలికల విద్య తదితర అంశాలపై అంతర్జాతీయ కార్మిక సమైక్య ప్రతినిధులు అవగాహన కల్పిస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సభ్యులు చేసుకోవాలన్నారు.

## పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహణ

**జైనూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
మండలంలోని గౌరి-1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, బాలింతలు, గ్రామ మహిళలకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గర్భిణీలు, బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవాల్సిన సమతుల ఆహారం గురించి వివరించారు. ముఖ్యంగా ఐరన్, ప్రోటీన్ సమృద్ధిగా ఉండే ఆహార పదార్థాలు, పచ్చి కూరగాయలు, పండ్లు తీసుకోవడం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. చిన్నారుల శారీరక, మానసిక ఎదుగుదలకు సమతుల



ఆహారం చాలా అవసరమని అంగన్‌వాడీ సిబ్బంది సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్, ఆశా వర్కర్లు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా బద్రి శ్రీనివాస్

- నిర్మల్ జిల్లా అధ్యక్షుడికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు
- హర్షం వ్యక్తం చేసిన కెమిస్ట్ డ్రగ్గిస్ట్ సంఘం సభ్యులు

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
తెలంగాణ రాష్ట్ర కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కో-కన్వీనర్‌గా నిర్మల్ జిల్లాకు చెందిన ప్రముఖ సీనియర్ డ్రగ్గిస్ట్ బద్రి శ్రీనివాస్ (బద్రి శీను) నియామకమయ్యారు. రాష్ట్ర సంఘం నూతనంగా ప్రకటించిన కార్యవర్గంలో ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించారు. ప్రస్తుతం ఆయన నిర్మల్ జిల్లా కెమిస్ట్ మరియు డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. జిల్లాలో అసోసియేషన్ బలోపేతానికి, డ్రగ్గిస్టుల సమస్యల పరిష్కారానికి బద్రి శ్రీనివాస్ అందిస్తున్న సేవలను గుర్తించిన రాష్ట్ర నాయకత్వం ఆయనను ఈ పదవికి ఎంపిక చేసినట్లు సంఘం ప్రతినిధులు తెలిపారు. ఆయన నియామకం పట్ల జిల్లాలోని మెడికల్ షాపుల యజమానులు, ఫార్మా రంగ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రస్థాయి పదవికి ఎంపికైన బద్రి శ్రీనివాస్‌కు జిల్లావ్యాప్తంగా పలువురు ప్రముఖులు, అసోసియేషన్ సభ్యులు అభినందనలు తెలిపారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన రాష్ట్ర కమిటీకి ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్రవ్యాప్తంగా డ్రగ్గిస్టుల సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేస్తానని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.





## చిరువ్యాపారులకు గ్యాస్ సెగ

- మళ్లీ కట్టెల పొయ్యే దిక్కు!
- ఆకాశాన్నంటిన సిలిండర్ ధరలు
- బ్లాక్ మార్కెట్‌లో అమ్ముకుంటేనే గిట్టుబాటు
- కట్టెలకు పెరిగిన డిమాండ్..
- క్వింటాల్ ధర రెట్టింపు చేస్తున్న వ్యాపారులు

**వాంకిడి, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితులు మరియు యుద్ధ ప్రభావంతో గ్యాస్ ధరలు సామాన్యులకు గుదిబండలా మారాయి. పెరుగుతున్న ధరల భారంతో సామాన్య గృహిణులతో పాటు చిరువ్యాపారులు విలవిల్లాడుతున్నారు. ముఖ్యంగా హోటల్ యజమానులు, తినుబండారాల తయారీదారులు గ్యాస్‌ను కొనలేక, వ్యాపారం సాగించలేక సతమతమవుతున్నారు. దీంతో గత్యంతరం లేక మళ్లీ పాత కాలపు కట్టెల పొయ్యిలనే ఆశ్రయిస్తున్నారు. గ్యాస్ ధరలు అందుబాటులో లేకపోవడంతో మండలంలోని పలు ప్రాంతాల్లో కొందరు చిరువ్యాపారులు తమ హోటళ్లను మూసివేశారు. వ్యాపారాన్ని కొనసాగించాలనుకునే వారు అదనపు భారాన్ని భరిస్తూ బ్లాక్ మార్కెట్లో గ్యాస్ కొనుగోలు చేస్తున్నారు. మరికొందరు తమ తినుబండారాల తయారీకి కట్టెల పొయ్యిని ఉపయోగిస్తూ నూనె వేడి చేస్తూ నెట్టుకొస్తున్నారు. ఒకవైపు గ్యాస్ ధరలు బాదుతుంటే, మరోవైపు కట్టెల వ్యాపారులు ఇదే అదునుగా ధరలను అమాంతం పెంచేశారు. గతంలో క్వింటాల్ రూ. 350 వరకు ఉన్న కట్టల ధరలను ప్రస్తుతం రూ. 700 నుంచి రూ. 800 వరకు పెంచి విక్రయిస్తున్నారు. డిమాండ్‌ను బట్టి ధరలు పెంచుతూ చిరువ్యాపారుల అవసరాన్ని సొమ్ము చేసుకుంటున్నారు. అయితే, గ్యాస్ కొరత వల్ల కట్టెల పొయ్యిపై చేస్తున్న వంటలు వినియోగదారులను ఆకట్టుకుంటున్నాయి. కట్టెల పొయ్యిపై వండిన ఆహార పదార్థాలు రుచిగా ఉంటున్నాయని వినియోగదారులు అభిప్రాయపడుతున్నట్లు చిరువ్యాపారులు చెబుతున్నారు. ధరలు పెరిగినా, రుచి కోసమైనా జనం కట్టెల పొయ్యి వంటల వైపు మొగ్గు చూపుతుండటమే తమకు కొంత ఊరటనిస్తుందని వారు పేర్కొంటున్నారు.



## ఖానాపూర్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో అగ్నిప్రమాదం

**సకాలంలో స్పందించి మంటలు ఆర్పిన ఫైర్ సిబ్బంది - తప్పిన భారీ ప్రమాదం - ఊపిరి పీల్చుకున్న స్థానికులు**

**ఖానాపూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ పట్టణ కేంద్రంలోని 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ ప్రాంగణంలో శుక్రవారం ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సబ్ స్టేషన్ కాంపౌండ్ గేటు సమీపంలో పేరుకుపోయిన చెత్తాచెదారానికి ఎండ తీవ్రత వల్ల అకస్మాత్తుగా నిప్పు అంటుకోవడంతో మంటలు ఎగిసిపడ్డాయి. మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు వెంటనే అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది మెరుపు వేగంతో సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. సకాలంలో స్పందించడం వల్ల విద్యుత్ పరికరాలకు మంటలు సోకకుండా అరికట్టగలిగారు, తద్వారా ఒక పెద్ద ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద సమాచారం అందుకున్న మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సకారం శ్రీనివాస్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విద్యుత్ శాఖ సిబ్బందితో మాట్లాడుతూ.. సబ్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. సబ్ స్టేషన్ పక్కనే పెట్రోల్ బంకుతో పాటు జనావాసాలు ఉన్నాయని, ఇలాంటి చోట్ల చెత్త పేరుకుపోవడం వల్ల భారీ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉంటూ భద్రతా ప్రమాణాలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఫైర్ సిబ్బందితో పాటు స్థానికులు పాల్గొన్నారు.

# కో-ఆప్షన్ పదవుల కోసం పోటీ

- ఆసిఫాబాద్‌లో నాలుగు దరఖాస్తులు
- నాయకులపై ఒత్తిడి తెస్తున్న ఆశావహులు
- నేటితో ముగియనున్న గడువు

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

జిల్లాలోని కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ మున్సిపాల్టీల్లో కోఆప్షన్ సభ్యుల ఎంపిక ప్రక్రియ వేడెక్కింది. కొత్త పాలక వర్గాలు ఏర్పడిన తర్వాత కోఆప్షన్ పదువుల కోసం గత వారం రోజులుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. కాగజ్‌నగర్‌లో భారీ స్పందన లభించింది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు 33 మంది దరఖాస్తులు చేసుకున్నారు. శనివారం దరఖాస్తులకు గడువు ముగియనుండడంతో మరిన్ని దరఖాస్తులు వచ్చే అవకాశముంది. ఈ నెల 16లోగా ఎన్నిక నిర్వహించేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు పూర్త చేస్తున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో నాలుగు కో ఆప్షన్ సభ్యులను ఎంపిక చేయనున్నారు. వీరిలో ప్రత్యేక పరిజ్ఞానం అనుభవం కలిగిన ఇద్దరు(ఒక పురుషుడు, ఒక మహిళ), మైనార్టీ కోటా కింద ఇద్దరు(ఒక పురుషుడు, ఒక మహిళ) ఎంపిక చేయనున్నారు. ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్ 11, కాంగ్రెస్ 9, బీజేపీ 5, ఎంఐఎం1, స్వతంత్రులు 4 స్థానాల్లో గెలుపొందారు. అనంతరం కాంగ్రెస్-బీజేపీ పొత్తుతో మున్సిపల్ చైర్ పర్సన్ పదవి కాంగ్రెస్ దక్కించుకుంది. ఇప్పుడు కోఆప్షన్ పదవుల పంపకంపై రాజకీయంగా చర్చలు జోరందుకున్నాయి. నాలుగు పదవుల్లో ఏ పార్టీకి ఎన్ని స్థానాలు దక్కుతాయన్నది పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

**చేతులెత్తే విధానం ద్వారా..**

కౌన్సిలర్లు చేతులెత్తే విధానం ద్వారా ఎంపిక జరుగనున్న నేపథ్యంలో, ఎవరికి మద్దతు ఇవ్వాలన్న అంశంపై పాలక వర్గంలో అంతర్గతంగా చర్చలు కొనసాగుతున్నాయి. ఇక కాంగ్రెస్, బీజేపీ పార్టీల్లో కోఆప్షన్ పదవుల కోసం తీవ్ర పోటీ నెలకొంది. ప్రత్యేక పరిజాజనం కోటాలో మాజీ కౌన్సిలర్లు కూడా బరిలోకి దిగటం విశేషం. మైనార్టీ కోటాలోనూ పోటీ తీవ్రంగానే ఉంది. మున్సిపల్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ అభ్యర్థులు తమకు పదవి కేటాయించాలని పార్టీ నాయకులపై ఒత్తి తెస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీ మైత్రితో కాంగ్రెస్ మున్సిపల్ చైర్ పర్సన్ స్థానాన్ని దక్కించుకోగా, ఇప్పుడు కోఆప్షన్ ఎంపికపై అందరి దృష్టి పడింది. బీఆర్ఎస్ బరిలో ఉంటుండడంతో రాజకీయం మళ్లీ వేడెక్కింది. కో ఆప్షన్ పదవుల కోసం అటు కాంగ్రెస్, ఇటు బీజేపీలో కూడా తీవ్ర పోటీ నెలకొంది. ప్రత్యేక పరిజాజనం, అనుభవం కలిగిన కోటాలో రెండు పదవులు కోసం మాజీ కౌన్సిలర్లు కూడా పోటీ పడుతున్నారు. ఈ రెండు పార్టీల్లోనూ మాజీలు అధికంగా ఉండడం విశేషం. మైనార్టీ కోటాలో కూడా ఇదే పరిస్థితి నెలకొంది. మున్సిపల్ ఎన్నికల సమయంలో తమకు మాట ఇచ్చారని..? తమకు ఖచ్చితంగా ఈ సారి కోఆప్షన్ పదవి ఇవ్వాలని పలువురు పట్టుబడుతున్నారు. దీంతో ఆయా పార్టీల నాయకులకు తలనొప్పిగా మారింది. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో హోరాహోరిగా అభ్యర్థులు దరఖాస్తులు చేస్తుండటంతో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. శనివారం చివరి గడువు కావడంతో తమకు చెందిన నాయకులతో ఆశీస్సులు తీసుకొని దరఖాస్తులు చేస్తున్నారు. పక్కాగా ఎవరికి కోఆప్షన్ ఇస్తామన్నది నాయకులు తేల్చక పోవడంతో అభ్యర్థుల్లోనూ టెన్షన్ పెరుగుతోంది. మున్సిపల్ చైర్ పర్సన్ ఎన్నికల్లో అనూహ్య పొత్తు కాంగ్రెస్, బీజేపీలు చేపట్టగా, ఈ సారి ఎలాంటి నిర్ణయం తీసుకుంటారన్నది కూడా చర్చ జోరందుకుంది. ఇక ఆసిఫాబాద్ మున్సిపాల్టీలో నాలుగు కోఆప్షన్ స్థానాలకు ఇప్పటి వరకు నాలుగు దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. ఈ మున్సిపాల్టీలో కేవలం నామ మాత్రపు పోటీ ఉన్నట్టు స్పష్టంగా కన్పిస్తోంది.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతి

**కుభీర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు ఎన్నిల అనిల్ ఆరోపించారు. శుక్రవారం నిర్మల్ జిల్లా కుభీర్ తహసీల్దార్ శివరాజ్ కు మొక్క కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కజొన్న పంట చేతికొచ్చి దాదాపు నెలరోజులు గడిచిపోతున్నప్పటికీ నేటికీ కేంద్రాలు తెరవకపోవడం విడ్డూరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మక్క రైతులు ప్రైవేట్‌లో రూ. 1700 క్వింటాలు అమ్ముకొని ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సోయా, కందులు, శనగలు రైతుకు చేతికి వచ్చిన సమయంలోనూ ప్రభుత్వం ఇదే నాటకం ఆడిందని ఆరోపించారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి 24 గంటలు వ్యవసాయ విద్యుత్, రైతుబంధు, రైతులకు వ్యవసాయ భీమా సౌకర్యం, రైతులకు సరిపడా ఎరువులను సరఫరా చేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉద్యమ నాయకులు పుప్పాల పీరాజీ, మాజీ మండల పరిషత్ ఉపాధ్యక్షులు మొహియుద్దీన్, సాప పోతన్న, పోగుల పోతన్న, పోగుల లింగన్న, దత్తాత్రి, కాశీనాథ్, నాగేష్, రైతులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఉద్యమ నాయకుడు పీరాజీ జన్మదినం సందర్భంగా ఆయనను బీఆర్ఎస్ నాయకులు సన్మానించారు.

# సోమగూడెంలో అక్రమ నిర్మాణాల కూల్చివేతలు

## భూమి స్వాధీనానికి కోర్టు ఆదేశాలు

**కాసిపేట, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మండలం సోమగూడెం సర్వే నెంబర్ 3లో అక్రమ నిర్మాణాల తొలగింపు, భూమి స్వాధీనానికి కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు శుక్రవారం అధికారులు చర్యలు చేపట్టనున్నారు. ఈ నెల 8న హైకోర్టు ఆదేశాలతో కూల్చివేతకు వచ్చిన కోర్టు, పోలీసు, రెవెన్యూ సిబ్బందిని గృహాల యజమానులు, స్థానికులు అడ్డుకున్నారు. దీంతో కోర్టులో ఈ భూమి హక్కుదారుగా నెగ్గిన భూ హక్కుదారుకు రూ. కోటి పరిహారం ఇచ్చేందుకు ఇరువర్గాల నాయకుల మధ్యవర్తిత్వంతో ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో గురువారం కోర్టు అధికారులను పిలిచి బుధవారం జరిగిన కూల్చివేతల అంశంపై వివరణ ఇవ్వాలని ఆదేశించారు. శుక్రవారం(ఏప్రిల్10) కూల్చివేతలకు పోలీసు బందోబస్తుతో సిద్ధంగా ఉండాలని ఆదేశించినట్లు సమాచారం. దీంతో ఇళ్ల యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఇరువర్గాల మధ్య బెల్లంపల్లి గురువారం రాత్రి 9గంటలు దాటినా చర్చలు కొనసాగాయి. సోమగూడెంలో కూల్చివేతల అంశం చర్చనీయాంశంగా మారింది. సర్వే నంబర్ 3పైకి ప్రభుత్వ లావణి పట్టా భూమి కాగా క్రయ విక్రయలు చేసుకునేందుకు అవకాశం లేదని, ఇది ఎలా సెటిల్మెంట్ చేసుకుంటారని వాదన ఉంది. కేవలం కేసు వాపస్ తీసుకోవడం తప్ప అధికారికంగా



సెటిల్మెంట్ చేసుకునే అవకాశం లేదని తెలుస్తుంది. కాని తర్వాత మళ్లీ సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయని అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ ప్రాంతం లావన్ పట్టా కాగా స్థానిక నాయకులతో పాటు పలువురు ఎటువంటి సరైన పత్రాలు లేకుండా విక్రయించారు. తక్కువ ధరకు వస్తుందని ఆశ చూపడంతో తెలియక అమాయకులు విక్రయించి ఇల్లు నిర్మాణం చేసుకున్నారు. ఈ భూమిపై రాంకిష్టయ్య కుటుంబం కోర్టుకు తమ భూమిగా వెళ్లగా అన్ని ఋజువులు కావడంతో కష్టయ్య కుటుంబం భూమిగా తేల్చడంతో ఇక ఆ భూమి స్వాధీనం చేసుకొని వారికి ఇచ్చేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఇటీవల అడ్డుకోగాశుక్రవారం చర్యల కోసం అధికారులు చూస్తుండగా ఏం జరుగుతుందా అని ఉత్కంఠ నెలకొంది.

# నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆదర్శనగర్ 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుంది. శుక్రవారం ఏడీఈ శ్రీనివాస్ రావు తెలిపిన వివరాల ప్రకారం, ఉదయం 8.30 గంటల నుండి 9.30 గంటల వరకు ఆదర్శనగర్, గాయత్రిపురం, రాంనగర్, ఆస్రాకాలనీ, భాగ్యనగర్, ఈద్గాం, మదీనా కాలనీ, శివాజీ చౌక్, విద్యానగర్, ఇరిగేషన్ ఆఫీస్, సోఫీ నగర్, డీమార్ట్, విజయ డైరీ, సాగర్ కన్వెన్షన్ హాల్, ఇందిరమ్మ కాలనీ, మహమ్మదీయ మజీద్, సిద్దాపూర్, సిద్దాపూర్ వాటర్ వర్క్స్ ఏరియాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందన్నారు.



## అంగన్‌వాడీల సేవలు వెలకట్టలేనివి

### జిల్లా సంక్షేమాధికారి రవూఫ్ ఖాన్

**తాండూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ టీచర్‌గా, ఆయాలుగా, పలు ఉద్యోగులుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ చేసిన వారి సేవలు వెలకట్టలేమని జిల్లా సంక్షేమాధికారి రవూఫ్‌ఖాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేచిని రైతు వేదికలో తాండూర్ సెక్టార్ పరిధిలో ఉద్యోగ విరమణ పొందిన అంగన్ వాడీ టీచర్లు, ఆయాలకు ఏర్పాటుచేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అచ్చులాపూర్- 7 అంగన్‌వాడీ టీచర్ అప్పాల రాధ, పలు ఆంగన్ వాడీ కేంద్రాల ఆయాలు అంకుబాయి, నానక్క బీమక్క, పుల్లమ్మ, లక్ష్మి, రాజుబాయి, మల్లుబాయి లకు బెల్లంపల్లి సీడీపీవో స్వరూపారాణి, అధికారులు, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి తొలి పాఠశాల అంగన్‌వాడీ కేంద్రమే అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్య అభ్యసించిన తనతో పాటు ఎంతోమంది ఉన్నత శిఖరాలకు చేరుకున్నారన్నారు. అనంతరం అన్నప్రాసన, అక్షరభ్యాసం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పోతురాజుల రాంబాయి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వరూపారాణి పాల్గొన్నారు.

## విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో మొక్క జొన్న పంట దగ్ధం

**తానూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా తానూర్ మండలం దాగం గ్రామంలో రైతు సుధాకర్ పాటిల్‌కు చెందిన రెండు ఎకరాల మొక్క జొన్న పంట విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కాలి బూడిదైంది. పొలంలోని ట్రాన్స్‌ఫార్మర్‌లో మంటలు చెలరేగి పంటకు వ్యాపించడంతో రూ.2లక్షల నష్టం వాటిల్లిందని బాధితుడు తెలిపారు. వ్యవసాయ శాఖ ఏఈఓ సయ్యద్ సిరాజ్ ఘటన స్థలాన్ని పరిశీలించారు.



# పేదలకు సొంతింటి కల సాకారం : జైనూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్

**జైనూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

పేదలకు సొంతింటి కల సాకారం కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జైనూర్ మార్కెట్ కమిటి చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్ అన్నారు. మండలంలోని ఉషేగాంలో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశం కార్యక్రమంలో తహసీల్దార్ ఆడ బీర్షావ్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్‌రావ్, మాజీ వైస్ ఎంపీపీ షేక్ చిర్లే లక్ష్మణ్, జిల్లా సీనియర్ నాయకులు మేస్రాం అంబాజీరావ్, జన్నావార్ పవన్ కుమార్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్‌రావ్ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చేస్తున్న సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. కుంరంభీం జిల్లాలో దశల వారీగా ఇందిరమ్మ గృహాలను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. మరి కొన్ని రోజుల్లో జిల్లాలో వేలాది గృహాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇళ్లను నాణ్యతగా నిర్మించుకోవాలని కోరారు. ఇళ్ల బిల్లులు సకాలంలో రాకుటే తమకు సమాచారం అందించాలని, సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచులు ఆత్రం నిర్మలబాయి, మేస్రాం భూపతి. మాజీ ఎంపీటీసీ ఆత్రం శశిపాల్, ఎంపీవో శషికుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఎంపీ, ఎమ్మెల్యేలపై కేసు పెట్టాల్సిందే

**నకిలీ మ్యాప్‌తో మోసం**
**ఏఎస్పీకి ఫిర్యాదు చేసిన మాజీ మంత్రి జోగు రామన్న**
**అదిలాబాద్ ఎయిర్‌పోర్ట్ మాస్టర్ ప్లాన్‌పై**
**చెలరేగిన రాజకీయ దుమారం**
**ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపణ**



**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
ఎయిర్ పోర్టు మాస్టర్ ప్లాన్ అంటూ విడుదల చేసిన నకిలీ మాస్టర్ ప్లాన్ పేరుతో ప్రజలను మోసం చేస్తున్న బీజేపీ ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల్ శంకర్ లపై చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి జోగు రామన్న డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏఎస్పీ మౌనికని కలిసి ఎంపీ, ఎమ్మెల్యేలపై ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ... కేంద్ర విమానయ శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు అదిలాబాద్ ఎయిర్పోర్ట్ ఎలాంటి మాస్టర్ ప్లాన్ తయారు కాలేదని మీడియా సమావేశంలో వెల్లడించారని తెలిపారు. కానీ ఇటీవలే ఎంపీ, ఎమ్మెల్యే ఎయిర్ పోర్టు కు సంబంధించిన నకిలీ మాస్టర్ ప్లాన్ ను విడుదల చేసి, మోసపూరిత ప్రకటనలతో ఆదిలా బాద్ ప్రజల్లో భయాందోళనను రేకెత్తిస్తున్నాయి ఆరోపించారు. తక్షణం ఎంపీ ఎమ్మెల్యే పై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. తక్షణం ఎంపీ, ఎమ్మెల్యేలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎలాంటి ప్రభుత్వ గుర్తింపు లేని డూప్లికేట్ మాస్టర్ ప్లాన్ ను పత్రికా ముఖంగా ఇటీవల విడుదల చేయడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. కేంద్ర విమాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు ఈనెల 17న కేంద్ర బృందంతో సర్వే నిర్వహించడం జరుగుతుందని తెలిపారని, మరి ముందే మాస్టర్ ప్లాన్ విడుదల చేసిన ఎమ్మెల్యే మోసపూరిత ప్రకటనలు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. తక్షణం ఎంపీ, ఎమ్మె ల్యేలపై కఠిన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షులు అజయ్, కౌన్సిలర్ లు వెనగంటి ప్రకాష్, ఆత్రం వెంకటేష్, అన్నెలా వసంత్, నాయకులు అశోక్ స్వామి, పందిరి భూమ న్నా, అనిల్, ధమ్మపాల్, కొండ గణేష్, బట్టు సతీష్,సృజన్, దివిటీ రాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.



## బాలల పరిరక్షణ కమిటీల ఏర్పాటు

**దిలావర్‌పూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, జిల్లా సంక్షేమ అధికారి వినుత్న ఆదేశాల మేరకు దిలావర్పూర్ మండలంలోని మాడెగావ్, సోన్ మండలంలోని జఫ్రాపూర్ గ్రామాల్లో గ్రామ బాలల పరిరక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధులు బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పిల్లల హింస నుంచి రక్షణ, పాఠశాల హాజరుపై అవగాహన కల్పించారు. బాలల హక్కుల రక్షణ కోసం 1098 చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని సూచించారు. కార్యదర్శులు కమిటీ సభ్యులతో బాలల పరిరక్షకు కట్టుబడి ఉంటామని ప్రమాణం చేయించారు.

## డీసీసీ ఉపాధ్యక్షుడికి సన్మానం

**ఖానాపూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ కౌన్సిలర్, మాజీ మున్సిపల్ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు రాజుర సత్యం ను శుక్రవారం ఖానాపూర్ మండలం బక్క అయ్యవారు సంఘ సభ్యులు సన్మానించారు. పట్టణంలోని ఆయన గృహంలో సత్యమును సభ్యులు శాలువతో సత్కరించారు.కార్యక్రమంలో సంఘ నాయ కులు వెంకటస్వామి, వెంకటేశ్వర్లు, పలువురు ఉన్నారు.



## జన్నారం ఎస్సైగా ఉదయ్ కిరణ్ నియామకం

**- ఉత్తర్వులు జారీ చేసిన సీపీ అంబర్ కిషోర్ ఝా**
**- ఒకటి రెండు రోజుల్లో బాధ్యతల స్వీకరణ..**



**జన్నారం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
జన్నారం మండల పోలీస్ స్టేషన్ నూతన సబ్ ఇన్స్పెక్టర్‌గా గుర్రం ఉదయ్ కిరణ్ నియమితులయ్యారు. ఈ మేరకు రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం సాయంత్రం అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. రామగుండం కమిషనరేట్‌లో వెయిటింగ్ (వీఆర్)లో ఉన్న ఉదయ్ కిరణ్‌ను జన్నారం ఎస్సైగా బదిలీ చేస్తూ సీపీ నిర్ణయం తీసుకున్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ నియామకం జరిగింది. నూతన ఎస్సైగా నియమితులైన ఉదయ్ కిరణ్ ఒకటి రెండు రోజుల్లో జన్నారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు చేపట్టనున్నారు. మండలానికి కొత్త ఎస్సై రానుండటంతో పోలీస్ సిబ్బంది, ప్రజలు ఆయన రాక కోసం వేచి చూస్తున్నారు.

## నేరాల అదుపునకు కమ్యూనిటీ ప్రోగ్రాం

**మంచిర్యాల ఏసీపీ ప్రకాష్**



**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
సమాజంలో జరుగుతున్న నేరాల అదుపునకు కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నమని మంచిర్యాల ఏసీపీ ఆర్. ప్రకాష్ అన్నారు. నస్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోనియా నగర్, శ్యామ్ నగర్ ఏరియాల్లో శుక్రవారం సీసీఎస్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంట్రాక్టు ప్రోగ్రాం నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో తనిఖీలు చేసి 60 ద్విచక్ర వాహనాలు, ఏడు ఆటోలకు సరైనా పత్రాలు లేకపోవడంతో వాటి యజమానులకు జరి మానాలు వేసారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ మధ్య కాలంలో రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, వాటి నియం త్రణకు ప్రతీ ఒక్కరూ భద్రత చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి వాహనదారుడు ఖచ్చితంగా తన వాహనానికి సంబంధించి అన్ని రకాల పత్రాలను కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి రోడ్డుపైకి పంపవద్దన్నారు. వేసవి సెలవుల సందర్భంగా ఊర్లకు వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విలువైనా వస్తువులు ఇంటి లో వదిలివెళ్లవద్దని సూచించారు. శాంతి భద్రతల పరిరక్షణకు అందరూ కృషి చేయాలని ఏసీపీ కోరారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల రూరల్ సీఐ గోపతి రవీందర్, లతో పాటు శ్యామ్ నగర్, సోనియా నగర్ ప్రాంతాల వాసులు, పోలీసులు పాల్గొన్నారు.



## గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

**సిర్పూర్ (టి), ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
గర్భిణులు తప్పనిసరిగా పోషకాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. మండలంలోని జైభీంనగర్, మన్నెగూడ, హీరాపూర్, సిర్పూర్-2, చీలపల్లి అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలు, పిల్లలు తీసుకోవ ల్సిన పోషకాహార గురించి సూపర్‌వైజర్ పద్మ వివరించారు. ఈ నెల 9 నుంచి 23 వరకు అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ్ పక్షం(పక్వాడ) కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలి పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు. కౌటల మండలం గుడ్లబోరి గ్రామంలో శుక్రవారం పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంగ, ఉప సర్పంచ్ మధులు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గర్భిణులు బాలింతలు, చిన్న పిల్లలు సమతుల్య ఆహారం తీసుకోవాలన్నారు. అనంతరం చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు తదితరులు పాల్గొన్నారు. జైనూర్ మండలంలోని ఐసీడీఎస్ కేంద్రాల్లో కొనసాగుతున్న పోషణ పక్వాడ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని గౌరి గ్రామ పంచాయతీ సర్పంచ్ ఆత్రం అయ్యూబాయి కోరారు. మండలంలోని గౌరి1 కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పోషణ,పక్వాడ కార్యక్రమంలో మాట్లాడారు. గర్భిణులు, బాలింతలకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతు గర్భిణులు, బాలింతలు ఐరన్, ప్రొటీన్, కూరగాయలు పండ్లు వంటి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. ఆదేవిధంగా చిన్నారుల ఎదుగుదలకు సమతుల్యమైన ఆహారం అవసరం అన్నారు. ముఖ్యంగా మహిళలు పోషకాహారంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లింగమ్మ, అంగన్‌వాడీ టీచర్ భుతాలె విమల బాయి, ఆశా కార్యకర్తలు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు. పెంచికలపేట మండలంలోని చెడ్వాయి గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి జ్యోతి గర్భిణులు, బాలింతలు, చిన్నారులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాస్, ఉప సర్పంచ్ నానాజీ, అంగన్‌వాడీ టీచర్ అబ్దుల్ ఉన్నీసా, ఏఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్పీఎం యాజమాన్యం తీరు అప్రజాస్వామ్యం

**- కార్మికుల హక్కులను కాలరాస్తే ఊరుకోం**
**- గుర్తింపు యూనియన్ ఎన్నికలు నిర్వహించాలి**
**- ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ డిమాండ్**

**కాగజ్‌నగర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
సిర్పూర్ కాగితం మిల్లు యాజమాన్యం కార్మికుల హక్కులను కాలరాస్తూ, అప్రజాస్వామికంగా వ్యవహరిస్తోందని ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కూషన రాజన్న ధ్వజమెత్తారు. శుక్రవారం పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త లేబర్ కోడ్‌లను అడ్డుపెట్టుకుని యాజమాన్యం ఎన్నికల నిర్వహణకు అడ్డుతగులుతోందని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ లేబర్ కోడ్‌లను ఇంకా ఆమోదించలేదని, వీటికి సంబంధించిన రూల్స్ కూడా ఇంకా ఫ్రేమ్ కాలేదని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడా లేబర్ కోడ్‌లు అమలు కావడం లేదని, ఈ మధ్య కాలంలోనే రాష్ట్రంలోని సుమారు పది పరిశ్రమల్లో కార్మిక సంఘం ఎన్నికలు విజయవంతంగా జరిగాయని గుర్తు చేశారు. రాష్ట్రంలో అన్ని పరిశ్రమల్లో ఎన్నికలు జరుగుతుంటే, కేవలం సిర్పూర్ పేపర్ మిల్లులోనే అభ్యంతరాలు తెలపడం యాజమాన్య వైఖరికి అద్దం పడుతోందని మండిపడ్డారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, వారి ప్రతినిధులను ఎన్నుకునేందుకు వెంటనే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎస్పీఎం మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపాల్, ఉపాధ్యక్షులు ముంజం శ్రీనివాస్, మహమ్మద్ షబ్బీర్, మొగిలి వెంకటేష్, సహాయ కార్యదర్శులు గడమల్ల మహేష్, కాశీపేట రాజేందర్, రామ్ శెట్టి రాజన్న, బిల్ల రమేష్, కోశాధికారి నీలి రాజన్న తదితరులు పాల్గొన్నారు.



## స్విమ్మింగ్ పూల్‌లో పక్కాగా
# సౌకర్యాలు కల్పించాలి

**నీటి శుభ్రత, భద్రత విషయంలో నిర్లక్ష్యం వద్దు - ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో కలెక్టర్ రాజర్షి షా**

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలకు, ముఖ్యంగా యువతకు, చిన్నారులకు సౌకర్యవంతమైన వాతావరణంలో ఈత అభ్యాసం అందించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఉదయం పట్టణంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో ఉన్న స్విమ్మింగ్ పూల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా స్విమ్మింగ్ పూల్‌లో నీటి శుభ్రత, ఫిల్టరేషన్ వ్యవస్థ, చేంజింగ్ రూములు, షవర్ సదుపాయాలు, భద్రతా చర్యలు తదితర అంశాలను కలెక్టర్ పరిశీలించారు. పూల్‌లోని నీరు నాణ్యంగా ఉండేలా తరచూ శుద్ధి చేయాలని, క్లోరినేషన్‌ను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పూల్‌కు వచ్చే క్రీడాకారులు, విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొనకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించాలని, ప్రత్యేకంగా మహిళలు, చిన్నారుల కోసం వేర్వేరు సమయాలు కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు తెలిపారు. అలాగే లైఫ్ గార్డులు ఎల్లప్పుడూ విధుల్లో ఉండేలా చూడాలని, ప్రమాదాల నివారణకు ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి కాలంలో అధిక సంఖ్యలో ప్రజలు స్విమ్మింగ్ పూల్‌ను వినియోగించే అవకాశం ఉన్నందున, శుభ్రత, భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని స్పష్టం



చేశారు. క్రీడలను ప్రోత్సహించే దిశగా స్విమ్మింగ్ పూల్‌ను అందుబాటులో ఉంచడం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.



# 8 ఎకరాల్లో మొక్కజొన్న దగ్ధం

**నర్సాపూర్ (జి), ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ జిల్లా నర్సాపూర్ (జి) మండలం తెంబుర్ని గ్రామంలో గురువారం రాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో ఎనిమిది ఎకరాల మొక్కజొన్న పంట పూర్తిగా దగ్ధమైనట్టు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన రైతులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, భార్గవ్ అనే రైతులకు చెందిన మొక్కజొన్న కోత కోసి పంటచేల్లో కుప్పలు వేసి ఆరబెట్టారు. గురువారం రాత్రి ఒక్కసారిగా మొక్కజొన్న పంటకు నిప్పు అంటుకోవడంతో 8 ఎకరాల్లో పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక సిబ్బంది గ్రామానికి చేరుకునేలోపే తమ పంట దగ్ధమైనట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు లక్షల పంట దగ్ధం కాగా పెట్టుబడి సైతం నష్టపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అగ్ని ప్రమాదానికి కారణాలు తెలియలేదు. రైతులకు జరిగిన నష్టంపై ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చినట్టు గ్రామస్తులు తెలిపారు. అదేవిధంగా ఆ పంట పొలాల పక్కన ఉన్న మరో రైతు ప్రశాంత్ పసుపు పంట నిప్పు ఆనడంతో అది రంగు మారిందని రైతు ఆవేదన వ్యక్తం చేశారు.



# అంగన్వాడీలకు స్మార్ట్ ఫోన్లు అందజేత

## ఎమ్మెల్యే రామారావు పటేల్



**ముథోల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
ముధోల్ ఐసిడిఎస్ పరిధిలో అంగన్వాడీలకు ప్రభు త్వం మంజూరు చేసిన స్మార్ట్ ఫోన్లను ఎమ్మెల్యే రామా రావు పటేల్ శుక్రవారం పంపిణీ చేశారు. బైంసాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో పలువురు అంగ న్వాడి కార్యకర్తలకు వీటిని అందించారు. ఈ కార్యక్ర మంలో జిల్లా అధికారి వినూత్న ఐసిడిఎస్ అధికారులు పాల్గొన్నారు.

# ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

**ప్రజలకు అవగాహన కల్పించిన మండల విస్తరణ అధికారి రవిదాస్**



**వాంకిడి, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని వాంకిడి మండల పీహెచ్సీ ఆరోగ్యవిస్తరణ అధికారి రవి దాస్ అన్నారు. శుక్రవారం వాంకిడి మండలం సవాతి గ్రామంలో పిహెచ్సీ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యం లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రవాసాల ప్రాముఖ్యత, క్షయ వ్యాధిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆరోగ్య విస్తరణ అధికారి మాట్లాడుతూ... రోజు రోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా వడదె బ్బ తగల కుండా ప్రజలు తీసు కోవాల్సిన చర్యల గురించి వివరించారు. వైద్యశిబిరం నిర్వహించి 45మందిని మందిని పరీక్షించి అవసరమైన 29మందికి మందులు పంపిణి చేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మండల ఆరోగ్యవిస్తరణ రవిదాస్ పెందోర్, డాక్టర్ రియాజ్, ఏఎన్ఎం గోదు బాయి సవాతి గ్రామ సర్పంచ్ సోయం చంపబాయ్,మాజీ సర్పంచ్ సోయం భీంరావ్,సెక్రెటరీ మల్లేష్, ఆశాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు గాలికుంటు వ్యాధి
# టీకాలు వేయించుకోవాలి

**పెంచికల్‌పేట మండలంలో టీకా కార్యక్రమం**
**రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి: పశువైద్యాధికారి డా. రాకేష్**

**పెంచికల్‌పేట, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
పశువులను వేధించే ప్రమాదకరమైన గాలికుంటు వ్యాధి నివారణే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన టీకాల పంపిణీ కార్యక్రమం పెంచికల్‌పేట మండలంలో ముమ్మరంగా సాగుతోంది. శుక్రవారం మండలంలోని కమ్మర్గాం, నందిగాం గ్రామాల్లో పశువైద్య శాఖ ఆధ్వర్యంలో నాలుగు నెలల వయసు పైబడిన పశువులకు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి డాక్టర్ రాకేష్ మాట్లాడుతూ.. వర్షాకాలం, వాతావరణ మార్పుల సమయంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉందని, ముందస్తుగా టీకాలు వేయించడం ద్వారా పశువుల ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపారు. కమ్మర్గాం సర్పంచ్ సులోచన భాస్కర్ గౌడ్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో రైతులు పశువులను తీసుకువచ్చి టీకాలు వేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది ఆనంద్ రావు, శివ కుమార్, శేఖర్‌లతో పాటు రైతులు మధునయ్య, బాపు తదితరులు పాల్గొన్నారు.

# ఇసుక వాహనాలు పట్టివేత

**ముథోల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
బైంసా ప్రాంతంలోని వివిధ ప్రాజెక్టులు వాగుల నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనా లను పట్టుకున్నట్టు జిల్లా ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. గురువారం రాత్రి బైంసా పోలీసులు నారిశక్తి మహిళా పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వివిధ వాగుల నుండి అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను పట్టుకుని రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు వివరించారు.



## నిర్మల్ మున్సిపల్ అభివృద్ధిపై
# ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డివి తప్పుడు ఆరోపణలు

**- నిధులు వెనక్కి వెళ్తుంటే మహేశ్వర్ రెడ్డి ఎందుకు పట్టించుకోలేదు?**
**- బీజేపీ తీరు సిగ్గుచేటు - నిలదీసిన మున్సిపల్ కౌన్సిలర్లు**

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**
నిర్మల్ మున్సిపాలిటీ అభివృద్ధి విషయంలో స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి కావాలనే అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్లు తీవ్రంగా మండిపడ్డారు. పట్టణ అభివృద్ధికి నిధులు అడ్డుకుంటున్నారంటూ బీజేపీ నేతలు చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని వారు స్పష్టం చేశారు. శుక్రవారం నిర్మల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కౌన్సిలర్లు కత్తి నరేందర్, గోపు గోపి, ఎస్పీ రాజు తదితరులు మాట్లాడారు. ప్రభుత్వపరంగా సాధారణ ప్రక్రియలో మంజూరైన నిధులను కూడా తానే స్వయంగా తెచ్చినట్లు ఎమ్మెల్యే ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదమని కౌన్సిలర్లు ఎద్దేవా చేశారు. నిర్మల్ అభివృద్ధికి తన కృషితోనే నిధులు వచ్చాయని చెప్పుకుంటున్న ఎమ్మెల్యే.. సుమారు 60 కోట్ల నిధులు వెనక్కి మళ్ళీపోతుంటే ఎందుకు చర్యలు తీసుకోలేక పోయారు? అని వారు సూటిగా ప్రశ్నించారు. 15 కోట్లతో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల రద్దుపై బీజేపీ నాయకులు ధర్నాలు చేయడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని, అభివృద్ధిని అడ్డుకోవడమే వారి ఏకైక అజెండా అని ధ్వజమెత్తారు. నిర్మల్ పట్టణాన్ని అభివృద్ధి పథంలో ఉంచాలనే లక్ష్యంతో కొత్త పాలకవర్గం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, ఏ పనులనూ అడ్డుకోవాల్సిన అవసరం తమకు లేదని వారు స్పష్టం చేశారు. కేవలం తమ రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికే బీజేపీ నాయకులు అబద్ధపు మాటలతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి పట్టణ అభివృద్ధికి ఆయన చేసిన కచ్చితమైన పని ఏంటో చెప్పాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు హరీష్, నాయకులు పోశెట్టి, రామకృష్ణ, చైతన్య, చారి పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతోనే అధిక లాభాలు

- రసాయన ఎరువులు వదిలి.. ప్రకృతి సాగు వైపు మళ్లాలి
- నేలతల్లి ఆరోగ్యం కాపాడుకోవడం మనందరి బాధ్యత
- జిల్లా వ్యవసాయాధికారిణి సురేఖ

**జన్నారం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

రసాయన ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించి, సహజ పద్ధతుల్లో సాగు చేయడం ద్వారా రైతులు పెట్టుబడి ఖర్చు తగ్గించుకోవడమే కాకుండా అధిక లాభాలు గడించవచ్చని మంచిర్యాల జిల్లా వ్యవసాయాధికారిణి సురేఖ పిలుపునిచ్చారు. జన్నారం క్లస్టర్ పరిధిలోని పోనకల్ రైతు వేదికలో శుక్రవారం జాతీయ ప్రకృతి వ్యవసాయ మిషన్‌పై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చింతలపల్లి, లింగయ్యపల్లి, ధర్మారం గ్రామాల నుండి ఎంపిక చేసిన 125 మంది రైతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సురేఖ మాట్లాడుతూ.. మితిమీరిన రసాయనాల వాడకం వల్ల నేల నిస్సారమవడమే కాకుండా, మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పచ్చిరొట్ట ఎరువులు, జీవామృతం, గోమూత్రం మరియు వర్మీ కంపోస్ట్ వంటి సహజ ఎరువులను వాడాలని రైతులకు సూచించారు.



వీటి వల్ల సాగు ఖర్చు గణనీయంగా తగ్గుతుందని, భూమి సారం పెరిగి నాణ్యమైన దిగుబడులు వస్తాయని వివరించారు. మంచిర్యాల సహాయ వ్యవసాయ సంచాలకులు కృష్ణ మాట్లాడుతూ.. రైతులు ప్రకృతి వ్యవసాయంపై మక్కువ పెంచుకోవాలని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం జన్నారం వ్యవసాయ అధికారి అంజిత్ కుమార్ ప్రకృతి సాగు పద్ధతులపై రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జన్నారం క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారులు మల్యాల త్రిసంధ్య, దివ్య, లవన్, ధర్మారం ఉపసర్పంచ్ మహేందర్, కృషి సఖీలు జక్కుల రజిత, గోగు అంజలి మరియు అధిక సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.



## జాతీయ స్థాయిలో మెరిసిన
# ఆదిలాబాద్ ఆణిముత్యం

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో ప్రాణాలను పణంగా పెట్టి పోరాడే సైనికుల త్యాగాన్ని తన అక్షరాల్లో అద్భుతంగా ప్రతిబింబించిన ఆదిలాబాద్ జిల్లా విద్యార్థి కాంబ్లే రిషాంత్ జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపు పొందాడు. కేంద్ర రక్షణ శాఖ నిర్వహించిన ప్రతిష్టాత్మక 'వీరగాథ 5.0' పోటీలలో అతను తన ప్రతిభను చాటుకొని జిల్లా కీర్తిని దేశవ్యాప్తంగా చాటాడు. గాదిగూడ మండలం బుద్ధమహర్ గూడ అనే మారుమూల గ్రామానికి చెందిన రిషాంత్, సైనికుల వీరత్వాన్ని హృదయాన్ని కదిలించేలా కవిత్వంగా ఆవిష్కరించాడు. దేశవ్యాప్తంగా వేల సంఖ్యలో వచ్చిన ఎంట్రీలలో అతని కవితలు ప్రత్యేకంగా నిలిచాయి. అతని ప్రతిభను గుర్తించిన కేంద్ర రక్షణ శాఖ కార్యదర్శి స్వయంగా అభినందిస్తూ ప్రశంసా పత్రంతో పాటు మెడల్‌ను అందజేశారు. జాతీయ స్థాయిలో మెరిసిన రిషాంత్‌ను జిల్లా కలెక్టర్ రాజర్షి షా శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రత్యేకంగా సన్మానించారు. శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మారుమూల గ్రామం నుండి వచ్చిన విద్యార్థి జాతీయ వేదికపై గుర్తింపు పొందడం జిల్లాకే గర్వకారణం. రిషాంత్ భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నాను అని పేర్కొన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్, డి ఈ ఓ రాజేశ్వర్, అధికారులు అజయ్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

పట్టణంలోని ప్రతి వార్డులో ఉన్న ప్రజా సమస్యల పరిష్కారం కోసమే నిరంతరం కృషి చేస్తామని మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్ స్పష్టం చేశారు. పట్టణంలోని 12వ వార్డులో గత వారం రోజులుగా వాటర్ మోటార్ చెడిపోవడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యను మున్సిపల్ చైర్ పర్సన్ ఆకాష్, వైస్ చైర్ పర్సన్ ఎండి అహ్మద్, కౌన్సిలర్ ఆత్రం కృష్ణమ్మల దృష్టికి కాలనీవాసులు తీసుకురావడంతో శుక్రవారం నూతన వాటర్ మోటార్‌ను ఏర్పాటు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... 12వ వార్డు ప్రజల విన్నపం మేరకు యుద్ధ ప్రాతిపదికన కొత్త మోటార్‌ను మంజూరు చేయించి, నీటి సరఫరాను పునరుద్ధరించామని వారు తెలిపారు. ప్రజా సేవలో భాగంగా వార్డుల అభివృద్ధికి తమ వంతు సహకారం



ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. తమ సమస్యను చెప్పిన వెంటనే స్పందించి పరిష్కరించినందుకు కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తూ చైర్‌పర్సన్ ఆకాష్, వైస్ చైర్‌పర్సన్ అహ్మద్, శాలువాలతో ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సల్మాన్ ఖాన్, ఆత్రం భీం భాయ్, నూరి, సుప్రజ పాల్గొన్నారు.



## ఆశ్రమ పాఠశాల విద్యార్థి
# అనుమానాస్పద మృతి

- జైనూర్ మండలంలో విషాదం..
- సిబ్బంది నిర్లక్ష్యమే కారణమని తల్లిదండ్రుల ఆరోపణ
- న్యాయం చేయాలంటూ కుటుంబ సభ్యుల ఆవేదన

**జైనూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలంలో ఓ ఆశ్రమ స్కూల్ విద్యార్థి అనుమానాస్పద పరిస్థితుల్లో మృతి చెందడం కలకలం రేపింది. ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలంలోని గంగపూర్ గ్రామానికి చెందిన దుర్వా అన్వేష్ 10. జైనూర్ లోని పనపాటర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో 4 తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అన్వేష్ హాస్టల్ లో ఒక్కసారిగా అస్వస్థతకు గురికావడంతో సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అతని మృతి చెందాడు. ఉపాధ్యాయ సిబ్బంది నిర్లక్ష్యం వల్లే తమ కొడుకు మృతి చెందాడని తల్లిదండ్రులు ఆరోపించారు. వారి పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వార్షిక పరీక్షలు ఉండటం వల్ల ఇటివలే హాస్టల్ లో తన కొడుకును వదిలి వెళ్ళినట్లు తండ్రి చెప్పారు. ఈ క్రమంలో అస్వస్థత గా ఉన్నాడని సమాచారం ఇచ్చారు. ఆసుపత్రికి వెల్లే లోపు అన్వేష్ మృతి చెందాడని.! హాస్టల్ లో పిల్లలు కొట్టుకున్నారా, లేక భవనం పై నుంచి పడి మృతి చెందాడని తెలియకుండా ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ఆ సమయంలో సిబ్బంది ఎవరూ అందుబాటులో లేరని.. తాను పలుమార్లు ఫోన్ చేసిన ఎవరూ స్పందించలేదని మండిపడ్డారు. ఈ ఘటనపై విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని తల్లిదండ్రులు డిమాండ్ చేశారు. ఇక విద్యార్థి మృతి పై అక్కడి ఆశ్రమ స్కూల్ సిబ్బంది ఎలాంటి ప్రకటన చేయలేదు.



## జన్నారం తహసిల్దార్‌గా
# బక్కయ్య బాధ్యతల స్వీకరణ

ఘనంగా స్వాగతం పలికిన రెవెన్యూ సిబ్బంది
ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని వెల్లడి

**జన్నారం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండల నూతన తహసిల్దార్‌గా గేడేకర్ బక్కయ్య శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవలి బదిలీల్లో భాగంగా ఇక్కడికి నియమితులైన ఆయన, శుక్రవారం కార్యాలయానికి చేరుకొని అధికారికంగా బాధ్యతలను స్వీకరించారు. నూతన తహసిల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన బక్కయ్యకు నాయబ్ తహసీల్దార్ శ్రీరామ్ మోహన్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన కార్యాలయ రికార్డులను పరిశీలించి, సిబ్బందితో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ బక్కయ్య మాట్లాడుతూ.. మండల పరిధిలోని ప్రజలకు, రైతులకు రెవెన్యూ సేవలు త్వరితగతిన అందేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యాలయానికి వచ్చే అర్జీదారుల సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తానని, ప్రభుత్వ పథకాలను అర్హులకు చేరవేయడంలో చిత్తశుద్ధితో పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, ఆర్.ఐలు కార్యాలయ సహాయకులు పాల్గొన్నారు.

# అందరి సహకారంతో గ్రామాభివృద్ధి

**వాంకిడి, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

గ్రామ ప్రజలందరికీ సహకారం భాగ్యస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి సాధ్యపడుతుందని, ఖమాన గ్రామ సర్పంచ్ గేడం సునీత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక ఫేస్ -2 కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఖమాన గ్రామంలోని అంబేద్కర్ చౌరస్తా సమీపంలో విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతిరోజు పారిశుద్ధ్య పనులు చేపడుతూ, తడి పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి గ్రామ పంచాయతీ ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది తదితరులున్నారు.



# గ్యాస్ గోదాముల వద్ద సిబ్బంది అప్రమత్తత అవసరం



అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించిన ఫైర్ సిబ్బంది - వేసవిలో చెత్తకు నిప్పు పెట్టవద్దని విజ్ఞప్తి

**జన్నారం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

వేసవి కాలం దృష్ట్యా గ్యాస్ గోదాముల వద్ద అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించడం అత్యవసరమని అగ్నిమాపక శాఖ అధికారులు సూచించారు. 'ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక'లో భాగంగా జన్నారం మండలం పోనకల్ గ్రామ పంచాయతీ పరిధిలోని హరిహర భారత్ గ్యాస్ గోదాం వద్ద శుక్రవారం అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అగ్నిమాపక సిబ్బంది మాట్లాడుతూ.. గ్యాస్ వినియోగదారులు లేదా సిబ్బంది గోదాం ప్రాంగణంలోకి వచ్చినప్పుడు మొబైల్ ఫోన్లు వాడకూడదని, ధూమపానం చేయరాదని స్పష్టం చేశారు. ముఖ్యంగా వేసవిలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉన్నందున గోదాం పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా నిరంతరం శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యవసాయదారులు లేదా స్థానికులు పొలాల్లోని చెత్తకు నిప్పు పెట్టేటప్పుడు గ్యాస్ గోదాముల భద్రతను దృష్టిలో ఉంచుకోవాలని, నిప్పు రవ్వలు గోదాం వైపు వ్యాపించకుండా జాగ్రత్త పడాలన్నారు. రాత్రి వేళల్లో చుట్టుపక్కల ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉంటూ ఎక్కడైనా మంటలు కనిపిస్తే అధికారులకు సమాచారం అందించాలన్నారు.

# తండ్రిగా మెగాస్టార్ మ్యాజిక్!



మెగాస్టార్ చిరంజీవి మళ్లీ తన మార్క్ ఎమోషనల్ డ్రామాతో అలరించడానికి సిద్ధమవుతున్నారా? అంటే సన్నివేశం అలాగే కనిపిస్తోంది. బాబీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రంలో చిరంజీవి టీనేజ్ అమ్మాయికి తండ్రిగా నటించబోతున్నట్లు సమాచారం. దీంతో ఈ పాత్రపై ఆసక్తి నెలకొంది. గతంలో `చూడాలని ఉంది`, `డాడీ`, `స్టాలిన్` వంటి చిత్రాల్లో తండ్రి పాత్రలో మెప్పించిన చిరంజీవి చాలా కాలం తర్వాత మళ్లీ పూర్తి స్థాయి తండ్రి-కూతుళ్ల సెంటిమెంట్ చుట్టూ తిరిగే కథను ఎంచుకోవడం విశేషం. ఈ ప్రచారం మెగా అభిమానుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతోంది.ఈ సినిమా కథా నేపథ్యం ప్రధానంగా కోల్‌కతా నగరంలో సాగుతుందని తెలుస్తోంది. గతంలో కోల్‌కతా నేపథ్యంలో `చూడాలని ఉంది` బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టించింది. మళ్లీ అదే బ్యాక్‌డ్రాప్‌లో, ఒక పవర్ ఫుల్ మాఫియా కథకు తండ్రి-కూతుళ్ల ఎమోషన్ తోడైతే ఫలితం అద్భుతంగా ఉంటుందని బాబీ భావిస్తున్నట్లున్నారు. ఈ సినిమాలో చిరంజీవి పాత్ర కేవలం సెటిల్డ్ గానే కాకుండా తన కూతురి కోసం ఏదైనా చేసే గంభీరమైన వ్యక్తిగా ఉంటుందని సమాచారం. చిరంజీవి కుమార్తె పాత్ర కోసం చిత్ర యూనిట్ ఓ యంగ్ హీరోయిన్ కోసం అన్వేషిస్తోందని తెలిసింది.అనస్వర రాజన్ లేదా ప్రీతి ముకుందన్ వంటి వర్ధమాన నటీమణుల పేర్లు పరిశీలనలో ఉన్నాయి. ఒక తండ్రిగా చిరంజీవి చేసే పోరాటం వారి మధ్య ఉండే అనుబంధం ప్రేక్షకులను కంటతడి పెట్టిస్తాయని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. యాక్షన్ సినిమాల హవా నడుస్తోన్న కాలంలో మెగాస్టార్ తన ఇమేజ్‌ను పక్కన పెట్టి కథకు ప్రాధాన్యతనిస్తూ ఇలాంటి పాత్రను ఎంచుకోవడం ఆసక్తికరం. ఈ చిత్రం కోసం చిరంజీవి తన లుక్ పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. టీనేజ్ అమ్మాయికి తండ్రిగా కనిపించడమే కాకుండా? సినిమాలోని ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్లలో మరింత స్టైలిష్ గా, యంగ్ గా కనిపించనున్నట్లు సమాచారం.బాబీ మునుపటి చిత్రం `వాల్తేరు వీరయ్య`లో చిరంజీవిలోని మాస్ కోణాన్ని ఆవిష్కరించగా ఈ సినిమాలో మాత్రం క్లాస్ మాస్ ఎలిమెంట్స్ తో పాటు బలమైన సెంటిమెంట్ ను మిక్స్ చేస్తున్నారని తెలుస్తోంది.



# కొత్త కథలతో వస్తున్నా!

"దక్షిణాది ప్రేక్షకులు నా పట్ల ఎప్పుడూ ఎంతో ప్రేమతో ఉంటున్నారు. నన్ను వాళ్ల కుటుంబంలోని వ్యక్తిలా ఆదరించారు. ఇది నాలో కొత్త ఉత్సాహాన్ని నింపుతుంది" అంటోంది తమన్నా. ఓవైపు మహిళా ప్రాధాన్య చిత్రాలు, మరోవైపు ఓటీటీ కథలు.. ప్రత్యేక పాటలు.. ఇలా ఎదురొచ్చిన అవకాశాన్ని అందుకుంటూ అభిమానుల్ని ఆకట్టుకునే ప్రయత్నం చేస్తుందీమె. ఈ మధ్యే సినీరంగంలో 21ఏళ్లు పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలోనే ఇటీవలే ఓ కార్యక్రమంలో పాల్గొన్న తమన్నా మాట్లాడుతూ.. "ప్రస్తుతం నేను నటించిన చిత్రాలన్నీ ఒక్కొక్కటిగా విడుదల కాబోతున్నందుకు ఉత్సాహంగా ఉన్నా. చాలా మంది నటీనటులకు.. ముఖ్యంగా నటీమణులకు ఇలాంటి అవకాశం లభించదు. నా కెరీర్ మొదలై దాదాపు 21ఏళ్లు అయ్యింది. అయినా ఇప్పుడే మళ్లీ ప్రారంభిస్తున్నట్లుగా ఉంది. దక్షిణాది పరిశ్రమలో లభిస్తున్న ఆదరణ నాకు మరింత ఉత్తేజాన్ని కలిగిస్తుంది. అందుకే నేను కూడా వారిని కొత్త కథలు, ప్రయోగాత్మక చిత్రాలతో అలరించాలని భావిస్తున్నాన"ని చెప్పుకొచ్చింది.




# 'కొరియన్ కనకరాజు'.. ఫస్ట్ సింగిల్ ప్రోమో రిలీజ్..

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ కొరియన్ కనకరాజు ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విభిన్నమైన కథలతో ప్రత్యేక గుర్తింపు పొందిన వరుణ్ తేజ్, ఈసారి కూడా కొత్త కాన్సెప్ట్ తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఆ సినిమా హారర్, కామెడీ అంశాలతో పాటు ఇండియన్- కొరియన్ కల్చర్ ఎలిమెంట్స్ తో రూపొందుతోంది. ఇప్పటికే షూటింగ్ చివరి దశకు చేరుకున్న ఆ మూవీ నుంచి తాజాగా ఫస్ట్ సింగిల్ కు సంబంధించిన ప్రోమో విడుదలైంది. కంసాహమ్ నీదా అనే ఆ పాట ప్రోమో సోషల్ మీడియాలో మంచి రెస్పాన్స్ తెచ్చుకుంటోంది. కొరియన్ భాషలో ధన్యవాదాలు అనే అర్థం వచ్చే ఆ పదాన్ని తెలుగు పాటలో యూజ్ చేయడం ఆసక్తికరంగా మారింది. ఇదే ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.ప్రోమోలో వరుణ్ ఊర మాస్ లుక్ లో కనిపిస్తూ అభిమానులను ఆకట్టుకుంటున్నారు. గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఆ పాటలో ఆయన స్టెప్పులు ఎనర్జీతో కనిపిస్తున్నాయి. అ లుక్ ఆయన గత సినిమాలతో పోలిస్తే పూర్తిగా భిన్నంగా ఉందని చెప్పాలి. కొరియన్ కనకరాజు సినిమాలో వరుణ్ తేజ్ కొత్త మేకోవర్‌తో కనిపించనున్నారని ఇప్పటికే క్లారిటీ వచ్చింది. చిత్రంలో వరుణ్ తేజ్ సరసన రితికా నాయక్ హీరోయిన్ గా నటిస్తోంది. వారి జోడీ కూడా సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. మేర్లపాక గాంధీ సినిమాల్లో కనిపించే కామెడీ, ఎమోషనల్ ఎలిమెంట్స్ కొరియన్ కనకరాజులో కూడా ఉంటాయని తెలుస్తోంది. ప్రస్తుతం టాలీవుడ్ లో టాప్ ఫామ్ లో ఉన్న సంగీత దర్శకుడు తమన్, కొరియన్ కనకరాజు ఫస్ట్ సింగిల్ కు మాస్ బీట్ తో కూడిన క్యాచీ ట్యూన్ అందించినట్లు ప్రోమో ద్వారా అర్థమవుతోంది. ఆ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించడం మరో ప్రత్యేకత. తమన్ సంగీతం, సిద్ శ్రీరామ్ గాత్రం కలయికతో ఆ సాంగ్ మెప్పిస్తోంది. సినిమాను యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. భారీ నిర్మాణ విలువలతో తెరకెక్కుతున్న ఆ సినిమాపై ఇప్పటికే మంచి బజ్ నెలకొంది. ముఖ్యంగా టైటిల్ గ్లింప్స్ విడుదలైన తర్వాత సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. ఇక కంసాహమ్ నీదా పూర్తి లిరికల్ సాంగ్ ను ఏప్రిల్ 11న సాయంత్రం 4:05 గంటలకు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఆ పాట విడుదలతో సినిమాకు మరింత హైప్ రావచ్చని వినికిడి. మొత్తంగా చూస్తే, వరుణ్ తేజ్ కెరీర్ లో మరో భిన్నమైన ప్రయత్నంగా కొరియన్ కనకరాజు మూవీ నిలవనున్నట్లు కనిపిస్తోంది. మరి చిత్రం బాక్సాఫీస్ వద్ద ఎలాంటి ఫలితాన్ని అందుకుంటుందో చూడాలి. అదే సమయంలో నిర్మాతలు త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటించి ప్రమోషన్స్ స్పీడప్ చేయడానికి సిద్ధమవుతున్నారు.



# ప్రపంచానికి ఆదర్శం భారతీయ వైద్యం

- దీర్ఘకాలిక వ్యాధులకు హోమియోపతితో చెక్
- శిబిరాన్ని ప్రారంభించిన కలెక్టర్ కుమార్ దీపక్
- ప్రజల ఆరోగ్యంపై 'ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక' దృష్టి

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

భారతీయ వైద్య విధానం ప్రపంచానికి ఆదర్శమని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ హోమియోపతి దినోత్సవం పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన ఉచిత మెగా ఆయుష్ వైద్య శిబిరానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. అనిత, ప్రోగ్రాం అధికారులతో హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచానికి భారతీయ వైద్య విధానం ఆదర్శంగా నిలిచిందని, ఎన్నో రకాల వైద్య పద్ధతుల ద్వారా వ్యాధులను నయం చేసే విధానాలను అవలంబించడం జరుగుతుందని తెలిపారు. భారతీయ వైద్య వ్యవస్థలో హోమియో, ఆయుర్వేదం, యునాని, యోగ వంటి అనేక పద్ధతులలో వ్యాధులను నయం చేసేందుకు అవకాశం ఉందని తెలిపారు. కీళ్ల నొప్పులు, మధుమేహం, రక్త పటు వంటి దీర్ఘకాలిక వ్యాధులను హోమియోపతి, న్యాచురోపతి, యోగ వంటి విధానాల ద్వారా నియంత్రించవచ్చని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఆయుష్ వైద్యులు అందుబాటులో ఉన్నారని, ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. అతి సాధారణ ఖర్చులతో ప్రకృతికి దగ్గరగా యోగ, ఫిజియోథెరపీ ద్వారా అందించే చికిత్సకు మంచి ఫలితాలు లభిస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ప్రజా పలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్యం దృష్ట్యా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, గ్రామీణ స్థాయి నుండి పరిశుభ్రతపై ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు పారిశుద్ధ్య నిర్వహణ కార్యక్రమంలో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, మన జిల్లాను పరిశుభ్రంగా తీర్చిదిద్దామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్యులు, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





చింతగూడలో ఆధార్ క్యాంపు

# మూడు రోజులు పొడిగింపు

### సందర్శించిన జిల్లా పోస్టల్ అధికారి రామారావు

**జన్నారం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

జన్నారం మండలం చింతగూడ గ్రామంలో నిర్వహిస్తున్న ఆధార్ ప్రత్యేక క్యాంపుకు ప్రజల నుండి విశేష స్పందన లభిస్తోందని మంచిర్యాల జిల్లా పోస్టల్ అదనపు సూపరింటెండెంట్ రామారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన చింతగూడలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రాన్ని సందర్శించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ.. ఆధార్ కార్డుల నమోదు, మార్పులు మరియు చేర్పుల కోసం ప్రజలు పెద్ద ఎత్తున తరలివస్తున్నారని తెలిపారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని, ఈ క్యాంపును మరో మూడు రోజుల పాటు పొడిగిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఆధార్ సేవల కోసం మండల కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం లేకుండా గ్రామంలోనే నిర్వహిస్తున్న అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా చిన్నారుల ఆధార్ నమోదు, బయోమెట్రిక్ అప్‌డేషన్ చిరునామా మార్పులు వంటి సేవలు ఇక్కడ వేగంగా అందించబడుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ సుతారి వినయ్ కుమార్, చింతగూడ సర్పంచ్, గ్రామ పెద్దలు మరియు అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

# అక్రిడిటేషన్ దరఖాస్తుల్లో సవరణకు అవకాశం ఇవ్వాలి

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ ప్రభుత్వం నిర్వహిస్తున్న జర్నలిస్టుల అక్రిడిటేషన్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక ఇబ్బందులను పరిష్కరించాలని కోరుతూ టీయూడబ్ల్యూజే (ఐజేయూ) నిర్మల్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొండూరు రవీందర్, వెంకగారి భూమయ్య బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకునే సమయంలో జర్నలిస్టులు తమ పేర్లు, ఇతర వివరాలను నమోదు చేయడంలో లేదా పత్రాలను అప్‌లోడ్ చేయడంలో కొన్ని చిన్నపాటి పొరపాట్లు దొర్లుతున్నాయని, అయితే ఒకసారి దరఖాస్తును 'సబ్మిట్' చేసిన తర్వాత వాటిని సరిదిద్దుకోవడానికి పోర్టల్‌లో ఎటువంటి 'ఎడిట్' ఆప్షన్ లేకపోవడం జర్నలిస్టులకు ఇబ్బందిగా మారిందని వారు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కేవలం చిన్నపాటి క్లరికల్ తప్పుల వల్ల అర్హులైన జర్నలిస్టుల దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యే అవకాశం ఉందని, దీనివల్ల వందలాది మంది జర్నలిస్టులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని వారు వివరించారు. ఈ విషయాన్ని సమాచార పౌర సంబంధాల శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి, పోర్టల్‌లో దరఖాస్తులను ఎడిట్ లేదా రివ్యూ చేసుకునే సదుపాయాన్ని కల్పించేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. తద్వారా అర్హులైన జర్నలిస్టులందరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా అక్రిడిటేషన్ ప్రక్రియ పూర్తవుతుందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సోషల్ మీడియా కన్వీనర్ యోగేష్ యూనిట్ సభ్యులు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.



# విద్యార్థులకు అవగాహన సదస్సు

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ పట్టణంలోని నాగార్జున నర్సింగ్ కళాశాలలో విద్యార్థుల భద్రతపై శనివారం పోలీస్ శాఖ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. కళాశాలలో ర్యాగింగ్ నియంత్రణ సైబర్ నేరాలు తదితర అంశాలపై అవగాహన కల్పించినట్టు తెలిపారు. జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు షీ టీం పోలీసులు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు.





# ఖాళీ ప్లాట్లలో చెత్త వేస్తే కఠిన చర్యలు


**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

ఖాళీ ప్లాట్లలో చెత్త వేయడం వల్ల పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయని, ఇకపై అలా చెత్త వేసిన వారిపై పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకుని భారీ జరిమానాలు విధిస్తామని రాజంపేట గ్రామపంచాయతీ సర్పంచ్ బుర్సా పోచయ్య హెచ్చరించారు. 99 రోజుల ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాజంపేట గ్రామపంచాయతీ పరిధిలోని ఓల్డ్ రాజంపేట, సాయి నివాడ గల్లీలలో పారిశుధ్యంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సర్పంచ్ బుర్సా పోచయ్య నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గులాం జావిద్, కిషోర్, లావణ్య పాల్గొని స్థానిక ప్రజలకు పారిశుధ్యం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఖాళీ ప్రదేశాల్లో అడ్డగోలుగా చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి ప్రజలు అనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉందన్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఖాళీ ప్లాట్లలో పేరుకుపోయిన చెత్తను, పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రజల సహకారం అవసరమని, ప్రతి ఒక్కరూ చెత్తను పంచాయతీ ట్రాక్టర్లకే అందజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# తెలంగాణ ఉద్యమకారుడుకి సన్మానం

**కుభీర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

కుబీర్ మండల కేంద్రం చెందిన తెలంగాణ ఉద్యమకారుడు పుప్పాల పిరాజుకి శుక్రవారం మండల టిఆర్ఎస్ నాయకులు సన్మానం చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన చేసిన పోరాటాన్ని కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు అనిల్, మహిముద్దీన్, పోతన్న ఉన్నారు.



# గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి 'ఎన్నారై అడ్వైజరీ కమిటీ'

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

తెలంగాణ రాష్ట్రంలో గల్ఫ్ ఎన్నారైల సంక్షేమం కోసం, వారి స్థితిగతుల అధ్యయనానికి ఎన్నారై అడ్వైజరి కమిటీ నియమించడం జరిగిందని ఎన్నారై నిర్మల్ జిల్లా బాధ్యులు స్వదేశీ పరికిపండ్ల తెలిపారు. కమిటీ వివరాలను వెల్లడించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు... గల్ఫ్ కార్మికుల సంక్షేమం, సమగ్ర ఎన్నారై పాలసీ పై అధ్యయనం చేయడానికి ఎన్నారై అడ్వయిజరీ కమిటీని ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జాబ్ చేసినట్టు జిల్లా అధ్యక్షులు స్వదేశీ పరికిపండ్ల తెలిపారు. రెండేళ్ల కాలపరిమితి గల ఈ కమిటీ, ఈ రోజుతో ఒక సంవత్సరం పూర్తి చేసుకున్నది. కమిటీ చైర్మన్ గా ఇండియన్ ఫారిన్ సర్వీస్ రిటైర్డ్ అధికారి, అంబాసిడర్ డా. బి.ఎం. వినోద్ కుమార్, వైస్ చైర్మన్ గా గల్ఫ్ వలసల నిపుణులు మంద భీంరెడ్డి లను నియమించారు. జిఎడి ప్రోటోకాల్, ఎన్నారై విభాగానికి చెందిన జాయింట్ సెక్రెటరీ స్థాయి ఐఏఎస్ అధికారి కమిటీకి మెంబర్ సెక్రెటరీగా వ్యవహరిస్తారు. కమిటీలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డా. ఆర్. భూపతి రెడ్డి, రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మన్, బాల్కొండ మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్ లను నియమించారు. గల్ఫ్ వలసలపై క్షేత్ర స్థాయిలో అవగాహన కలిగిన ప్రవాసీ కార్మిక నాయకులు సింగిరెడ్డి నరేష్ రెడ్డి, లిజీ జోసెఫ్, చెన్నమనేని శ్రీనివాస రావు, కొట్టాల సత్యంనారా గౌడ్, గుగ్గిల్ల రవిగౌడ్, నంగి దేవేందర్ రెడ్డి, స్వదేశ్ పరికిపండ్ల లను కమిటీ సభ్యులుగా నియమించారు. ఈ కమిటీ గల్ఫ్ తదితర గమ్యస్థాన దేశాలలోని అల్పాదాయ తెలంగాణ వలస కార్మికులకు ఆయా దేశాలలో లభిస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ఈ కమిటీ పరిశీలించవలసి ఉన్నది. దేశంలోని కేరళ, పంజాబ్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, బీహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల్లో గల్ఫ్ కార్మికులకు అందుబాటులో ఉన్న సంక్షేమ పథకాలను కమిటీ అధ్యయనం చేయాలి. ప్రవాసీ కార్మికుల సమస్యలను అర్థం చేసుకోవడానికి, పరిష్కారాలను కనుగొనడానికి ఈ కమిటీ గల్ఫ్ దేశాలను కూడా సందర్శించాల్సిన అవసరం ఉన్నది. కమిటీ ఇచ్చే నివేదిక ఆధారంగా... ఎన్నారై పాలసీ రూపకల్పనతో పాటు, తెలంగాణ గల్ఫ్ అండ్ అదర్ ఓవర్సీస్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డు (గల్ఫ్ దేశాల్లోని తెలంగాణ ప్రవాసీ కార్మికుల సంక్షేమబోర్డు) ఏర్పాటు చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుంది.

# ఫూలే దేశానికి దిక్సూచి

## బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి మహాత్మా జ్యోతిబాఫూలే..



ఈ దేశంలో మహాత్ముడు అని అనగానే గాంధీ గుర్తుకు వస్తాడు. కానీ అంతకంటే ముందు మహాత్ముడు ఉన్నారు. ఆయన ఎవరో కాదు మహాత్మా జ్యోతిబా పూలే. భారత దేశానికి వెలుగులు పంచిన వారు. మహోన్నత మానవుడు. సమున్నత భారతీయపు నేల మీద నడిచిన గొప్ప వ్యక్తి. అంతకు మించిన సంఘ సంస్కర్త. జ్యోతిబా పూలే గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ దేశానికి 78 ఏళ్లయింది స్వేచ్ఛ లభించి. ఇప్పటికీ ఎప్పటికీ..ఎల్లప్పటికీ.. ఈ లోకంలో సూర్య చంద్రులు ఉన్నంత దాకా నిలిచే ఉంటారు పూలే. సమాజంలో మూఢనమ్మకాలు, అంధవిశ్వాసాలతో నలిగిపోతూ అణగారిన బడుగు బలహీన వర్గాలకు మహాత్మా జ్యోతిబా పూలే కొత్తదారి చూపారు. చేయి పట్టి నడిపించారు. విద్య అనేది ప్రతి ఒక్కరి హక్కు అని చాటిచెప్పారు. భారతదేశంలో సామాజిక సంస్కరణ ఉద్యమానికి బీజం మొదటి మహోన్నతుడు మహాత్మా జ్యోతిబా పూలే అనే చెప్పాలి. ఆయన సతీమణి సావిత్రిబాయి పూలే మన దేశంలో తొలి మహిళా ఉపాధ్యాయురాలు. సంఘ సంస్కర్త, ఉద్యమకారుడు, సమాజ సేవకుడైన జ్యోతీబా పూలే మహారాష్ట్రలోని సతారా జిల్లాలోని వ్యవసాయ కుటుంబంలో 1827 ఏప్రిల్ 11న జన్మించారు. పూలేను తన ఉద్యమ గురువుల్లో ఒకరిగా మన రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భావించారు.

### అసమానతలు లేని సమాజాన్ని కోరుకున్న మహనీయుడు..

మహాత్మా జ్యోతిబా పూలే 19వ శతాబ్దపు భారతదేశంలో ప్రముఖ సామాజిక సంస్కర్త, ఆలోచనాపరుడు, కార్యకర్త. కుల ఆధారిత వివక్షకు వ్యతిరేకంగా పోరాడటానికి, అణగారిన వర్గాల హక్కుల కోసం, ముఖ్యంగా మహిళలు, నిమ్న కులాల హక్కుల కోసం వాదించడానికి ఆయన తన జీవితాన్ని అంకితం చేశారు. భారతదేశంలో మహిళా విద్య, సాధికారత కోసం జరిగిన ఉద్యమంలో పూలే ఒక మార్గదర్శక వ్యక్తి. సాంప్రదాయ నిబంధనలను ఉల్లంఘించి, ప్రస్తుత సామాజిక క్రమాన్ని సవాలు చేస్తూ, 1848లో పూణేలో మొదటి బాలికల పాఠశాలను స్థాపించారు. విద్య, సామాజిక సంస్కరణ, సమానత్వం ద్వారా అణగారిన వర్గాలను ఉద్ధరించడానికి ఉద్దేశించిన సత్యశోధక్ సమాజ్ (సత్య అన్వేషకుల సంఘం)ను కూడా పూలే స్థాపించారు. నాటి సమాజంలో మూఢ ఆచారాలైన కన్యాశుల్కం, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పూలే పోరాటాలు చేశాడు. బావ సారూప్యత కలవారందరిని ఏకతాటిపైకి తీసుకువచ్చి సమాజానికి ఒక కొత్త మార్గాన్ని చూపాడు. చిన్న వయస్సులో వితంతువులైన వారికి స్వయంగా వివాహాలు జరిపించాడు. 1864లో 'బాలహత్య ప్రతిబంధక్ గృహ' స్థాపించాడు. నాటి సమాజంలో వితంతువులు ఎదుర్కొంటున్న దుర్భర పరిస్థితులను గ్రహించి వారి కోసం ఆశ్రమాన్ని స్థాపించారు. వితంతు మహిళలలకు శిరోముండనం చేసే ఆనవాయితీకి స్వస్తి పలకాలన్నారు. శిశుహత్యలు, బాల్య వివాహాల నివారణకోసం ప్రత్యేక చొరవ తీసుకొని అండగా నిలిచారు.

### సత్యశోధక సమాజం..

భారత స్వాతంత్ర్య ఉద్యమం అంచున ఉన్నప్పుడు, అనేక మంది సంస్కర్తలు సామాజిక అస్పృష్టతను తొలగించడం ద్వారా సమాజాన్ని జ్ఞానోదయం చేయడానికి ప్రయత్నించారు. జ్యోతిబా పూలే అటువంటి వ్యక్తిత్వం కలిగి ఉన్నారు. వారు హక్కులు, న్యాయంతో వారికి సాధికారత కల్పించడం ద్వారా నిరుపేదవర్గాలను నిలబెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఆయన రాసిన సత్యశోధక్ సమాజం 19వ శతాబ్దంలో సమాజంలో గణనీయమైన మార్పును తీసుకువచ్చింది. 1873 సెప్టెంబర్ 24న సత్య శోధక సమాజాన్ని పూలే స్థాపించాడు. దేశంలోనే ఇది మొట్టమొదటి సంస్కరణోద్యమం. శూద్రులు అతి శూద్రులపై నాటి సమాజంలోని కొన్ని వర్గాలు ప్రదర్శించే క్రూర వైఖరిని పూలే తులనాత్మకంగా పరిశీలించాడు. సహపంక్తి భోజనానికి సంసిద్ధత ప్రకటించాడు. అయన ప్రతి ఒక్కరికీ సమాన స్వేచ్ఛ హక్కును తీర్మానించాడు. కార్మికులు, రైతులు, మహిళల హక్కుల కోసం అలుపెరుగని పోరు చేశారు. దేశమనే దేహానికి శూద్రులు ప్రాణం, రక్తనాళాలలాంటి వాళ్లు అని పేర్కొన్న మహాత్మా పూలే చివరి శ్వాస వరకు సమాజాన్ని సంస్కరించారు. పూలే తన రచనల ద్వారా కూడా సమాజాన్ని మేల్కొల్పారు. మరీ ముఖ్యంగా పత్రికల ద్వారా ప్రచారం చేసి వారిలో ప్రశ్నించే తత్వాన్ని పెంచారు. జ్యోతిరావు పూలే రచనలు ఆ కాలం నాటి వైవాహిక పద్ధతులను సవాలు చేశాయి.

### మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒక్కటే..

పూలే అత్యంత ముఖ్యంగా విద్య కోసం ఆయన నిరంతరం పరితపించేవారు. అజ్ఞానం, దోపిడీ సంకెళ్ల నుంచి అణగారిన ప్రజలను విముక్తి చేయడానికి విద్య కీలకమని ఆయన దృఢంగా విశ్వసించారు. భారతదేశంలో సార్వత్రిక విద్య, బాలికల విద్య కోసం అటువంటి ఆలోచనలు రాడికల్‌గా పరిగణించబడే సమయంలో పూలే, తన భార్య సావిత్రిబాయి పూలేతో కలిసి ఉద్యమానికి మార్గదర్శకత్వం వహించారు.

### జ్యోతిబా పూలే రచనలు..

మహాత్మా పూలే మరాఠీకి చెందిన రచయిత, ఆలోచనాపరుడు, సంఘ సంస్కర్త. ఆయన స్థాపించిన సంస్థ పేరు సత్యశోధక్ సమాజ్.
మహాత్మా పూలే రాసిన 'సర్వజనిక సత్యధర్మ' అనే గ్రంథం సత్యాన్వేషణ సమాజానికి ప్రామాణిక గ్రంథంగా పరిగణించబడుతుంది.
సమాజ స్వరంగా, 'దీనబంధు' వారానికొకసారి ప్రచురించబడింది.
మహాత్మా పూలే రాసిన 'అన్‌టచబుల్స్' అనే అముద్రిత పుస్తకం దళితుల గురించి.
1869లో బ్రాహ్మణ పూజారుల దోపిడీని పూలే 'బ్రాహ్మణాచే కసబ్'లో వెల్లడించాడు.
1873లో 'గులాంగిరి'లో ఆయన నిమ్న కుల బానిసత్వం చారిత్రక అవలోకనాన్ని అందించారు.
'గులామగిరి'ని అమెరికాలోని ఆఫ్రికన్‌అమెరికన్లకు అంకితం చేశారు.
జోతిరావు తన మరణానికి ముందు సర్వజనిక్ సత్యధర్మాన్ని రాశాడు. కానీ అది అతని మరణం తర్వాతే ప్రచురించబడింది.

## నేడు జ్యోతిబాపూలే జయంతి



### జ్యోతిబా పూలే కు మహాత్మా బిరుదు..

1888లో బొంబాయి ప్రజలు ఆయనను సత్కరించి, 'మహాత్మా' అనే బిరుదును ప్రదానం చేశారు. రైతులు, బహుజన వర్గాల సవాళ్లను ముందు ఉంచి, ఆయన ప్రగతిశీల ఆలోచనలను అభివృద్ధి చేసి, మహారాష్ట్రలో మహిళా విద్యకు పునాది వేశారు. 1888 మే 11న ముంబాయిలోని కోలివాడలో జరిగిన ఒక కార్యక్రమంలో ముంబాయి ప్రజల తరఫున రావు బహదూర్ వాదేకర్ 'మహాత్మా' అనే బిరుదును పూలేకు ప్రదానం చేశారు. తరతరాలుగా అణిచివేతకు గురవుతున్న బడుగు బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యాన్ని కల్పించడం లక్ష్యంగా వారి సాధికారత కోసం తపించిన మహాత్మాపూలే 1890 నవంబర్ 28న తుది శ్వాస విడిచారు. 199వ జయంతి సందర్భంగా మహనీయునికి ఘన నివాళి.

# దంచికొడుతున్న భానుడు

- ఉమ్మడి జిల్లాలో భానుడి భగ భగలు
- వడగాల్పుల ధాటికి అల్లాడుతున్న జనం
- సింగరేణి గనుల్లో ఎండప్రచండం
- అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు

(ప్రభాత సమాచారం, ప్రత్యేక ప్రతినిధి)
ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నమోదవుతున్న ఉష్ణోగ్రతలు జనాన్ని ఆందోళనకు గురిచేస్తున్నాయి. మూడు రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. వరుసగా మరో మూడు రోజుల పాటు ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఆందోళన మరింత తీవ్రం అవుతున్నది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని నాలుగు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 42 డిగ్రీల స్థాయిలో నమోదు అవుతున్నాయి శుక్రవారం అత్యధికంగా 42.3 డిగ్రీలు నమోదు కాగా నిర్మల్, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల్లో సైతం 41 దాకా నమోదు కావడం ఆందోళన కలిగిస్తున్నది. వర్షాకాలం సీజన్‌లో భారీ వర్షాలు కురవకపోవడం ఈసారి తీవ్రమైన ఎండలకు కారణం అన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. తాజాగా ఎండల పరిస్థితి జనసంచారానికి తీవ్రమైన అడ్డంకిగా మారుతున్నాయి. ప్రభుత్వ పనులతో పాటు వ్యవసాయ మార్కెట్లలో ధాన్యం అమ్ముకునేందుకు వస్తున్న రైతులకు ఎండలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

**సింగరేణిలో ఆందోళనకరం..**

భారీ ఎండలు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో విస్తరించి ఉన్న సింగరేణి ప్రాం తంలో ఆందోళనకరంగా మారుతున్నాయి బెల్లంపల్లి, మందమర్రి, మంచిర్యాల, శ్రీరాంపూర్, ఆసిఫాబాద్, తాండూర్, గోలేటి, తిర్యాని, కాజీపేట ప్రాంతాల్లో తీవ్రమైన వేడి పెరిగింది. సిర్పూర్ పేపర్ మిల్ విస్తరించి ఉన్న కాగజ్‌నగర్ టౌన్ సహా పరిసర ప్రాంతాల్లోనూ ఎండ తీవ్రత విపరీతంగా పెరగడంతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ముఖ్యంగా సింగరేణి కార్మి కులు ఎండ తీవ్రతను తట్టుకోలేని పరిస్థితి కనిపిస్తోంది అత్యవసరమైతే మినహా ప్రజలు బయటకు రావద్దని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఇదిలా ఉండగా.. రాష్ట్రవ్యాప్తంగా రానున్న రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు రెండు నుంచి 4 డిగ్రీలు పెరిగే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. వాతావరణంలో నెలకొన్న మార్పులతో గత వారం ఉష్ణోగ్రతలు తగ్గుముఖం పట్టాయి. గత రెండు రోజుల నుంచి మళ్లీ గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదు అయ్యే అవకాశం ఉందని పేర్కొంది. శుక్రవారం చాలా చోట్ల గరిష్ట ఉష్ణోగ్రతలు 2 డిగ్రీల వరకు పెరిగినట్లు తెలి పింది. అత్యధికంగా ఆదిలాబాద్, జిల్లాలో 42.3 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు నమోదై నట్లు వెల్లడించింది. ఎండలు ఇలానే కొన సాగితే తీవ్రత అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆరెంజ్ అలర్ట్ జారీ చేయనున్నట్లు వాతావరణ శాఖ పేర్కొంది. ఎండల తీవ్ర ఎక్కువ ఉన్న సమయాల్లో చిన్న పిల్లలు, వృద్ధులు బయటకు వెళ్లకుండా ఉండాలని, జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

# మల్బరీ సాగుపై క్షేత్రస్థాయి పరిశీలన

**మల్బరీ సాగుతో రైతులకు సిరులు**

**నర్సాపూర్‌లో తోటలను సందర్శించిన ఎంపీడీవో - సబ్సిడీలపై అవగాహన**

కడెం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం):
రైతులు సంప్రదాయ పంటలకు స్వస్తి పలికి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు ఇచ్చే పట్టు పురుగుల పెంపకం వైపు మొగ్గు చూపాలని కడెం ఎంపీడీవో సునీత పిలుపునిచ్చారు. శుక్రవారం నర్సాపూర్ గ్రామంలోని మల్బరీ తోటను ఈజీఎస్ ఏపీఓ జయదేవ్‌తో కలిసి ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పట్టు పురుగుల పెంపకం, షెడ్ల నిర్మాణం తదితర అంశాలను టెక్నికల్ అసిస్టెంట్ రాములును అడిగి తెలుసుకున్నారు.

**ఏడాదికి 7 పంటలు.. ప్రభుత్వ ప్రోత్సాహం...**

టెక్నికల్ అసిస్టెంట్ రాములు మాట్లాడుతూ.. రెండు ఎకరాల్లో మల్బరీ సాగు చేపడితే ఏడాదికి 6 నుంచి 7 పంటలు తీయవచ్చని వివరించారు. పురుగుల పెంపకం కోసం నిర్మించే షెడ్లకు సుమారు రూ.4.50 లక్షల వరకు ఖర్చవుతుందని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి భారీగా సబ్సిడీలు అందుతాయని తెలిపారు. అవసరమైన మొక్కలను ఎల్లాపూర్ నుంచి సరఫరా చేస్తామన్నారు. బోరు లేదా బావి సౌకర్యం ఉన్న రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.





## రేపు మంచిర్యాలకు కేటీఆర్ రాక

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 11గంటలకు నస్పూర్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో జరిగే జిల్లా స్థాయి పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొంటారు. క్యాతనపల్లి మున్సిపల్ ఎన్నికల్లో ఇటీవల ఎన్నికై బాధ్యతలు చేపట్టిన నూతన పాలకవర్గాన్ని సన్మానిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30గంటలకు బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య కూతురు వివాహా వేడుకకు హాజరవుతారు. 1.30గంటలకు క్యాతనపల్లిలో బాల్క సుమన్ నివాసం వద్ద మీడియాతో మాట్లాడుతారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ హైదరాబాద్‌లో కేటీఆర్‌ను కలసి మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.

## నేడు జ్యోతిబాపూలే జయంతి

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

జిల్లా కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో ఈ నెల 11న ఉదయం 10గంటలకు మహాత్మా జ్యోతిబాపూలే జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి భాగ్యవతి తెలిపారు. ఉత్సవాలకు అధికారులు, ప్రజలు హాజరు కావాలని కోరారు.

## 14న అంబేడ్కర్ జయంతి

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

జిల్లా కేంద్రంలోని అంబే ద్కర్ చౌరస్తా(ఐబీ)లో ఈ నెల 14న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 135వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఉప సంచాలకులు సిహెచ్. దురా ప్రసాద్ తెలిపారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు విగ్రహానికి పుష్పమాల అలంకరణ, కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్లో వేడుకలు నిర్వహిస్తామన్నారు.

## జన గణనకు యంత్రాంగం సన్నద్ధం

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

జన గణనకు యం త్రాంగం సిద్ధమవుతోంది. వచ్చే నెల 11న జనగణన చేపట్టేందుకు గ్రామాలు, పట్టణాల వారీగా కుటుంబాల లెక్కింపు చేపట్టనుంది. మే 11 నుంచి జూన్ 9 వరకు జరిగే ఈ గణనలో కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు మొదటి విడ తలో కుటుంబాలు, ఇంటిలో ఉన్న జనాభా, పురుషులు, స్త్రీలు, ఎంత మంది ఉన్నారనే వివరాలు నమోదు చేస్తారు. ఇక రెండో విడత ఫిబ్ర వరిలో జరిగే గణనలో నమోదైన వ్యక్తుల జాబితాలో వారి వయస్సు నుంచి మొదలు విద్యార్హత, ఆదాయం, సామాజిక స్థితి, తదిత రవన్నీ నమోదు చేస్తారు. ఈ మేరకు ఎన్యుమ రేటర్లకు శిక్షణ కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికే మున్సిపల్ కమిషనర్లు, తహ సీల్దార్లు, మండల పంచాయతీ అధికారులకు గణనపై శిక్షణ పూర్తయింది. ఎన్యుమరేటర్లుగా ఎక్కువగా ప్రభుత్వ, ప్రైవేటు టీచర్లను నియ మించనున్నారు. 200 నుంచి 300 ఇళ్లకు ఒకరి చొప్పున ఎన్యుమరేటర్లు సర్వే చేస్తారు. 33 అం శాలతో కూడిన ప్రశ్నావళితో ఇంటింటికి వెళ్లి నమోదు చేయనున్నారు. ఈ మేరకు పూర్తి స్థాయిలో కసరత్తు జరుగుతోంది.

## పట్టణంలో విద్యుత్ వైర్ల చోరీ

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

ఆదిలాబాద్ పట్టణంలోని పాత హౌసింగ్ బోర్డు కాలనీలో కైలాస్ సింగ్ ఇంటి నిర్మాణం చేపడుతున్నారు. హౌస్ వైరింగ్ కోసం 41 బండిళ్లను తెప్పించగా గుర్తు తెలియని దుండగులు శుక్రవారం తెల్లవారుజామున వాటిని ఎత్తు కెళ్లారు. దీంతో బాధితుడు వన్టన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

# హిందూ సమాజం ఐక్యంగా ఉండాలి

### భారతి స్వామీజీ, ఎమ్మెల్యే రామారావు పటేల్

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

హిందూ సమాజం ఐక్యంగా ఉంటూ.. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలని భద్రాచలం పీఠాధిపతి విశ్వ ఆత్మానందగిరి స్వామీజీ పేర్కొన్నారు. శుక్రవారం లక్ష్మణచాందలోని రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో ఉప మండలం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం ఏర్పాటు చేశారు. దీనికి ఆయన హాజరై మాట్లాడారు. ఆర్ఎస్ఎస్ తెలంగాణ ప్రాంత సేవా ప్రముఖ్ శివ శంకర్ మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శత వసంతాల సందర్భంగా హిందూ సమ్మేళనాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం మహిళలతో సాముహిక కుంకుమార్చన చేయించారు. హిందూ సమ్మేళన కమిటీ అధ్యక్షుడు గంగాధర్, ఉపాధ్యక్షుడు మధుకర్రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిన్నయ్య, కోశాధికారి సంతోష్, కార్యదర్శులు అశోక్, గంగాధర్, ఆర్ఎస్ఎస్ జిల్లా ప్రముఖ్ హన్మాండ్లు పాల్గొన్నారు.



**లోకేశ్వరం మండలంలో...**

ఏకీకృత హిందూ సమాజం కోసం కులభేదాలు తొలగిపోవాలని భువనేశ్వర పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ అన్నారు. లోకేశ్వరంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో కల్లూర్ ఖండ మండలం ఆధ్వర్యంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ మాట్లాడుతూ హిందువులంతా కలిసి మెలిసి ఉండాలని పేర్కొన్నారు.



**కుంటాలలో...**

హిందువులంతా ఐక్యంగా ఉండాలని భువనేశ్వర పీఠాధిపతి కమలానంద భారతి స్వామీజీ పేర్కొన్నారు. మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయ ప్రాంగణంలో హిందూ సమ్మేళనం నిర్వహించారు. సర్పంచ్ పెంటవార్ దశరథ్, ప్రధాన వక్త వేంపల్లి ప్రతాప్, ఉపమండల అధ్యక్ష, కార్యదర్శులు లక్ష్మణ్ పటేల్, నర్సయ్య ఉన్నారు.

**పూజలు చేసిన ముథోల్ ఎమ్మెల్యే...**

మండలంలోని విఠాపూర్‌లో శుక్రవారం ముత్యాలమ్మ, చాందా మహంకాళి, మహాలక్ష్మి, ఐదు చేతుల పోచమ్మ, అడెల్లి పోచమ్మ పునఃప్ర తిష్టాపన మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రామా రావు పటేల్ ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, విఠల్ రెడ్డి, సర్పంచ్ లింగురాం, ఉప సర్పంచ్ అశోక్, వీడీసీ చైర్మన్ కట్ట రాజశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## అడవిలో 9వ శతాబ్దపు శిల్పాల గుర్తింపు



**ఖానాపూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ జిల్లా పెంబి మండలంలోని తాటిగూడకు పది కిలోమీటర్ల దూరంలో ఉన్న దట్టమైన అడవిలో ఈర్లగండి (వీరుల గండి) ప్రాంతంలో రెండు పురాతన వీరగల్లు శిల్పాలను ప్రముఖ చరిత్ర పరిశోధకుడు కరిపె రాజ్ కుమార్ ఇటీవల గుర్తించారు. వీరగల్లు శిల్పంలో వీరుడు కుడిచేతిలో బాకుతో, నడుముకు కత్తితో, చేతులు కాళ్లకు కడియాలతో, దండలకు వెండి కడియాలతో శత్రువుతో హోరాహోరీగా పోరాడుతున్నట్లు ప్రతిబింబించబడింది. పైభాగంలో సూర్య, చంద్రుల చిహ్నాలు చెక్కబడి ఉండటం గమనార్హం. ఈ శిల్పం క్రీస్తు శకం 9వ శతాబ్దానికి చెందినదిగా భావిస్తున్నారు. పురాతన మంచినీటి బావి మరోవీరగల్లు శిల్పం.. అక్కడే మరో వీరగల్లు రెండు అంతస్తులుగా చెక్క బడి ఉంది. పైభాగంలో వీరుడు చెవులకు జూకాలు ధరించి, కుడిచేతిలో ఖడ్గం, ఎడమచేతిలో డాలు పట్టుకుని ఉండగా కింది అంతస్తులో అదే వీరుడు తన యుద్ధాశ్వాన్ని ప్రేమగా నిమురుతూ చూపించబడింది. తెలంగాణ చరిత్ర బృందం కన్వీనర్ శ్రీరామోజు హరగోపాల్ విశ్లేషిస్తూ, వీరుడు మాత్రమే కాకుండా అతని గుర్రం కూడా యుద్ధంలో ప్రాణాలు విడిచిందని అర్థమని తెలిపారు. ఇది క్రీస్తు శకం10వ శతాబ్దానికి చెందిందని, చాళుక్య శైలిలో చెక్క బడినదిగా గుర్తించారు. వీటి సమీపంలోనే ఒక పురాతన మంచినీటి బావి కూడా ఉంది.

## కొమ్మలకు కాస్తున్న బొప్పాయి కాయలు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

సాత్నాల మండలంలోని జామని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో చోటు చేసుకున్న ఘటన అందరిని ఆశ్చర్యానికి గురిచేసింది. సాధారణంగా బొప్పాయి కాయలు చెట్టుపైకి పాకుతున్నట్లు కాస్తాయి. కానీ ఈ పాఠశాలలో ఉన్న బొప్పాయి చెట్టుకు మాత్రం కాయలు కొమ్మలకు కాస్తున్నాయి. విత్తనాలలో వచ్చిన మార్పులు, వాతావరణ ప్రభావం లేదా చెట్టు పెరుగుదలలో చోటు చేసుకున్న మార్పుల కారణంగా ఇలాంటి ఘటనలు సంభవించే అవకాశం ఉందని వృక్షశాస్త్ర నిపుణులు పేర్కొంటున్నారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయంగా మారడంతో చెట్టును చూసేందుకు జనం తరలివస్తున్నారు.





### రోడ్డు భద్రతలో ఆదిలాబాద్

## ఆర్టీవోకు జాతీయ అవార్డు

**ఆదిలాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

రోడ్డు భద్రతపై వినూత్న కార్యక్ర మాలు చేపట్టినందుకుగాను ఆదిలాబాద్ జిల్లా ఆర్టీవో అధికారులకు జాతీయ స్థాయిలో 'రోడ్డు భద్రత ఎక్స్ లెన్స్ అవార్డు' లభించింది. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేశారు. జిల్లాలో 800 మంది విద్యార్థులతో నిర్వహించిన మానవ గొలుసు, 'అమ్మా.. నాన్న.. నెమ్మదిగా డ్రైవ్ చేయండి' వంటి సందేశాలతో చేపట్టినఅవగాహన కార్యక్రమాలు జాతీయ స్థాయిలో ప్రశంసలు పొందాయి. ఇండివిజువల్ విభాగంలో డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమిషనర్ పి.రవీందర్ కుమార్, ఎంవీఐ ఎస్.శ్రీనివాస్, ఏఎంవీఐ కె.హరేంద్ర కుమార్లు బెస్ట్ పర్ఫార్మర్ అవార్డులు అందుకున్నారు.

## మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

**ముథోల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మ హత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై బిట్ల పెర్సిస్ తెలిపిన వివరాల మేరకు మండలంలోని ఎడిబిడ్ గ్రామానికి చెందిన నందనం సుధాకర్ (49) కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతు న్నాడు. నయం కాకపోవడంతో మనస్తాపానికి గురయ్యాడు. రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు భైంసాలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుని భార్య రాజమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



## గొంతులో ఇరుక్కున్న చికెన్ ముక్క

### కాపాడిన వైద్యులు

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం):** దస్తురాబాద్‌కు చెందిన లక్ష్మణ్ (40) అనే వ్యక్తి గొంతులో చికెన్ ముక్క ఇరుక్కుని తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. మంచిర్యాలలోని కాకతీయ గ్యాస్ట్రోలివర్ ఆస్పత్రి వైద్యుడు నవీన్ ఎండోస్కోపీ ద్వారా ఆ ముక్కను చాకచక్యంగా తొలగించి ప్రాణాపాయం నుంచి కాపాడారు. ఈ సందర్భంగా సమయానికి స్పందించిన వైద్యులకు బాధితుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

## సైబర్ మాయగాళ్ల చేతిలో యువకుడు

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)** తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ట్రేడ్ విత్ రాధిక అనే గ్రూప్‌లో మెసేజ్ చూసి మోసపోయిన ఓయువకుడు సీసీసీ పోలీసులను ఆశ్రయించాడు. ఎస్సై ప్రశాంత్ తెలిపిన వివరాల మేరకు నస్పూర్ మండలం సీతారాంపల్లికి చెందిన ఆరికె వెంకటస్వామిని తన అనుమతి లేకుండా ట్రేడ్ విత్ రాధిక అనే గ్రూప్ యాడ్ చేశారు. ఈ గ్రూప్ లో తక్కువ పెట్టుబడి పెడితే ఐదు గంటల్లో రెట్టింపు డబ్బు లు ఇస్తామని గత నెల 2న మెసేజ్ వచ్చింది. దీనికి ఆకర్షితుడైన వెంకటస్వామి రూ.41,659 ద్వారా చెల్లించాడు. 5 గంటల అనంత రం ఫోన్ చేసినా చాటింగ్ చేసినా స్పందించలేదు. దీంతో మోసపోయానని గ్రహించి 4న సైబర్ క్రైమ్ నంబర్ 1930కు ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు. ఫోన్ పే చేసిన డబ్బులు గుర్తు తెలియని వ్యక్తి అకౌంట్‌లో రూ.26,063లు హోల్డ్ అయిఉన్నట్లు తెలిసింది. ఈ విషయమై తనకు న్యాయం చేయాలని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

# సీపీఐ సీనియర్ నాయకుడు జోసఫ్ రాజు కన్నుమూత

### తాళ్లగురిజాలలో విషాద ఛాయలు.. పార్టీ శ్రేణుల నివాళి



**బెల్లంపల్లి, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం):** బెల్లంపల్లి మండల సీపీఐ సీనియర్ నాయకుడు, రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి గొర్రె జోసఫ్ రాజు (64) శుక్రవారం తెల్లవారుజామున గుండెపోటుతో కన్నుమూశారు. తాళ్లగురిజాల గ్రామానికి చెందిన ఆయన సుదీర్ఘ కాలం పాటు పార్టీలో క్రియాశీలక పాత్ర పోషించారు. మూడు సంవత్సరాల క్రితం పంచాయతీ కార్యదర్శిగా పదవీ విరమణ పొందిన ఆయన, గత నాలుగు దశాబ్దాలుగా ఆర్ఎంపీ వైద్యుడిగా పేదలకు నిరంతర సేవలు అందించారు. తాళ్లగురిజాల, రంగపేట, మాలగురిజాల, బట్వాన్‌పల్లి గ్రామాల్లో వైద్యుడిగా, పాస్టర్‌గా ప్రజలతో ఆయనకు విడదీయలేని అనుబంధం ఉంది. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. జోసఫ్ రాజు మరణవార్త తెలియగానే మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఆయన భౌతికకాయాన్ని దర్శించుకున్నారు.

**నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడిన నేత..**

జోసఫ్ రాజు మృతి సీపీఐ పార్టీకి తీరని లోటని మండల కార్యదర్శి బొంతల లక్ష్మీనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ శ్రేణులతో కలిసి ఆయన భౌతికకాయంపై ఎర్రజెండా కప్పి ఘనంగా నివాళులర్పించారు. నమ్మిన సిద్ధాంతం కోసం చివరి శ్వాస వరకు శ్రమించిన గొప్ప వ్యక్తిని కోల్పోయామని వారు పేర్కొన్నారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నాయకులు గోమాస గంగారాం, మేరుగు పోశం, జూపాక సురేందర్, మాజీ సర్పంచ్ దూగుట తిరుపతి, కలాలి భూమేశ్వర్ తదితరులు ఉన్నారు.

# అర్హులైన గిరిజనులకు సంక్షేమ పథకాలు

### ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్

**ఉట్నూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)** ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హు లైన గిరిజనులకు అందేలా అధికారులు క్షేత్రస్థాయిలో కృషి చేయాలని ఐటీడీఏ పీవో యువరాజ్ మర్మాట్ అన్నారు. శుక్రవారం ఐటీడీఏ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో పనుల పు రోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఆరోగ్యం, గిరిజన సహకార సంఘం ఇంజినీరింగ్, విద్య, గురుకులాలు, మహిళా, శిశు సంక్షేమం, ఉద్యానవన, వ్యవసాయ, గ్రామీణ నీ టి సరఫరా, భూ



వివాదాలు, అటవీ హక్కుల చట్టం, తదితర విభాగాల అధికారులు తమకు కేటాయించిన పనులను నిర్ణీత గడువులోగా చేయాలన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల అమలు వేగవంతం చేయాలన్నారు. ఈ సందర్భంగా అధికారులు తమ శాఖల ప్రగతిని వివరించారు.

# కలప స్మగ్లర్‌కు 14 రోజుల రిమాండ్

**కడెం, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)** మండలంలోని అల్లంపల్లి అటవీప్రాం తంలో ఇటీవల టేకు చెట్లను నరికిన కేసులో గ్రా మానికి చెందిన కోమటి చిన్నయ్యకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఉడుంపూర్ ఎఫ్ ఆర్వో జి. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. గురువారం రాత్రి నిందితుడిని డీఆర్వో ప్రకాశ్, ఎల్బీవో ఆరుణ్ జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

## నిలిపి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

**లక్ష్మణచాంద, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)** రోడ్డుపై ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొట్టడంతో ఒకరికి గాయాలైన సంఘటన సోన్ మండలంలోని కడ్తాల్ గ్రామ శివారులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూర్ బయలుదేరిన లారీ శుక్రవారం కడ్తాల్ శివారులో ఎన్‌హెచ్ 44పై ఆగిఉంది. ఉత్తరప్రదేశ్ నుంచి బెంగళూర్ వైపు వెళ్తున్నమరో లారీ నిలిపి ఉన్న లారీని ఢీకొట్టింది. క్లీనర్ ప్రదీప్ కుమార్ త్రిపాఠికి తీవ్రగా యాలు కావడంతో నిర్మల్‌లోని ఓఆస్పత్రికి తరలించారు. ఘటనలో నిలిపిన లారీ ధ్వంసం కావడంతో డ్రైవర్ వికాస్ సాకేత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఢీకొట్టిన డ్రైవర్ త్రిపాఠిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

## బైక్‌ను అడ్డుకున్న కుక్క: ఒకరికి గాయాలు

**నర్సాపూర్ (జి), ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)** మండలంలోని అర్లి(కె) ఎకోడ్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. తురాటి గ్రామానికి చెందిన ప్రసాద్ బైక్‌పై భైంసా వైపు వెళ్తుండగా అర్లి(కె) ఎక్స్ రోడ్డు వద్దకు రాగానే కుక్క అడ్డురావడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు. కాలు విరగడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు.

## ఈ ఆరోగ్య సమస్యలు ఉంటే

# పుచ్చకాయ తినొద్దు



ప్రభాత సమాచారం,
హెల్త్ డెస్క్

వేసవి వచ్చిందంటే చాలు పుచ్చకాయ గుర్తుకువస్తుంది. ఎర్రగా, తియ్యగా ఉండే ఈ పుచ్చకాయను తినడం అందరికి చాలా ఇష్టం. వేసవి తాపాన్ని తగ్గించడంలో పుచ్చకాయకు మించిన పండు మరొకటి లేదు. అందుకే చాలామంది వేసవిలో పుచ్చకాయను ఇష్టంగా తింటారు. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల శరీరం డీహైడ్రేషన్ బారిన పడకుండా కాపాడుతుంది. విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు కూడా పుష్కలంగా ఉంటాయి. ఇన్ని ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నప్పటికీ, కొంతమంది పుచ్చకాయను తినకూడదు. ఎందుకంటే కొన్ని ఆరోగ్య సమస్యలు ఉన్నవారికి పుచ్చకాయ మేలు కంటే కీడే ఎక్కువ చేస్తుంది.

### కిడ్నీ సమస్యలు ఉన్నవారు :

కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం ఉత్తమం. ముఖ్యంగా డయాలసిస్ చేయించుకుంటున్నవారు లేదా కిడ్నీలు సరిగా పనిచేయని వారు పుచ్చకాయ తినకూడదు. ఎందుకంటే పుచ్చకాయలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఆరోగ్యకరమైన వ్యక్తుల్లో కిడ్నీలు పొటాషియంను సమతుల్యం చేస్తాయి. కానీ కిడ్నీ సమస్యలు ఉన్నవారిలో అధిక పొటాషియం రక్తంలో పేరుకుపోతుంది. దీనివల్ల హైపర్‌కలేమియా అనే పరిస్థితి వస్తుంది. ఇది గుండె లయను దెబ్బతీస్తుంది , ప్రాణాంతకం కూడా కావచ్చు. కాబట్టి కిడ్నీ సమస్యలు ఉన్నవారు పుచ్చకాయ తినే ముందు వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.

### మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారు :

పుచ్చకాయలో సహజ చక్కెరలు ఉంటాయి. మధుమేహం ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినాలి లేదా పూర్తిగా మానుకోవాలి. పుచ్చకాయ గ్లైసెమిక్ ఇండెక్స్ ఎక్కువగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను వేగంగా పెంచుతుంది. మధుమేహం నియంత్రణలో లేనివారు పుచ్చకాయ తింటే రక్తంలో చక్కెర స్థాయిలు ఒక్కసారిగా పెరిగి సమస్యలు వస్తాయి. ఒకవేళ తినాలనుకుంటే, చిన్న ముక్క మాత్రమే తినాలి. ఇతర ఆహారాలతో కలిపి తినడం వల్ల చక్కెర స్థాయిలు నెమ్మదిగా పెరుగుతాయి. మీ ఆహార ప్రణాళికలో పుచ్చకాయను చేర్చుకునే ముందు మీ వైద్యుడిని లేదా డైటీషియన్‌ను సంప్రదించడం ఉత్తమం.

### జీర్ణ సమస్యలు ఉన్నవారు :

కొంతమందికి పుచ్చకాయ తిన్న తర్వాత కడుపు ఉబ్బరం, గ్యాస్, విరేచనాలు వంటి జీర్ణ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా ప్రకోప ప్రేగు సిండ్రోమ్ సెన్సిటివిటీ ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండాలి. పుచ్చకాయలో ఫ్రక్టోజ్ అనే చక్కెర ఉంటుంది. ఇది కొంతమందికి జీర్ణం కావడం కష్టం. అలాగే పుచ్చకాయలో ఉండే కొన్ని సమ్మేళనాలు కూడా జీర్ణ సమస్యలను కలిగిస్తాయి. మీకు తరచుగా జీర్ణ సమస్యలు ఉంటే, పుచ్చకాయను తినడం మానేసి చూడండి, మీ సమస్యలు తగ్గుముఖం పడితే, పుచ్చకాయ మీకు పడటం లేదని అర్థం చేసుకోవచ్చు.



### అలెర్జీలు ఉన్నవారు :

పుచ్చకాయ అలెర్జీలు చాలా అరుదు. కానీ కొంతమందికి పుచ్చకాయ తిన్న తర్వాత అలెర్జీ లక్షణాలు కనిపించవచ్చు. చర్మంపై దద్దుర్లు, దురద, వాపు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. మీకు ఇతర పండ్లకు అలెర్జీలు ఉంటే, పుచ్చకాయ తినే ముందు జాగ్రత్తగా ఉండటం మంచిది.

### గుండె సమస్యలు ఉన్నవారు :

గుండె సమస్యలు ఉన్నవారు పుచ్చకాయను మితంగా తినాలి. పుచ్చకాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటం వల్ల రక్త పరిమాణం పెరుగుతుంది. ఇది గుండెపై ఒత్తిడిని పెంచుతుంది. ముఖ్యంగా గుండె బలహీనంగా ఉన్నవారు లేదా గుండె వైఫల్యం ఉన్నవారు పుచ్చకాయను ఎక్కువగా తినకూడదు. మీ గుండె సమస్య తీవ్రతను బట్టి పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది మీ వైద్యుడు నిర్ణయిస్తారు.

ఈ ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పుచ్చకాయకు దూరంగా ఉండటం లేదా మితంగా తినడం మంచిది. అయితే, ప్రతి ఒక్కరి శరీరం ఒక్కోలా ఉంటుంది. ఒకరికి సమస్య కలిగించిన ఆహారం మరొకరికి సమస్య కలిగించకపోవచ్చు. కాబట్టి, మీకు నిర్దిష్ట ఆరోగ్య సమస్యలు ఉంటే, పుచ్చకాయ తినే ముందు మీ వైద్యుడిని లేదా పోషకాహార నిపుణుడిని సంప్రదించడం ఉత్తమం. వారు మీ ఆరోగ్య పరిస్థితిని బట్టి పుచ్చకాయ తినవచ్చా లేదా అనేది సరైన సలహా ఇవ్వగలరు.





## పుష్కర ఏర్పాట్లలో నిర్లక్ష్యం వద్దు

# పక్కాగా ప్రణాళికలు సిద్ధం చేయండి

■ భక్తుల సౌకర్యార్థం ఘాట్ల అభివృద్ధికి ప్రతిపాదనలు
■ సమీక్షా సమావేశంలో ఆర్అండ్‌బీ చీఫ్ ఇంజనీర్ మోహన్ నాయక్ ఆదేశం

**మంచిర్యాల, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

గోదావరి పుష్కరాలు- 2027లో భాగంగా పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయాలని రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్, సి.ఆర్.ఎన్. ఌ ఎండి టి.జి.ఆర్.డి.సి. అధికారి మోహన్ నాయక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య లతో కలిసి దేవాదాయ, నీటిపారుదల, మున్సిపల్, విద్యుత్ శాఖల అధికారులతో పుష్కర ఏర్పాట్లకు సంబంధించిన బడ్జెట్ కేటాయింపు పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్, సి.ఆర్.ఎన్.ఎండి టి.జి.ఆర్.డి.సి. అధికారి మాట్లాడుతూ పుష్కర ఏర్పాట్లలో భాగంగా ప్రజా ప్రయోజనకరమైన సౌకర్యాలు మాత్రమే కల్పించాలని, దేవాదాయ శాఖ పరిధిలోని గోదావరి నది తీర ప్రాంతంలో ఏర్పాటు చేసే పుష్కర ఘాట్ల వద్ద గల ఆలయాల అభివృద్ధి పనులు, భక్తులకు అవసరమైన తాత్కాలిక ఏర్పాట్లు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలకు సమర్పించాలని తెలిపారు. టైర్ 1 పనులలో భాగంగా పుష్కర ఘాట్ల అభివృద్ధికి నిధులు కేటాయించేందుకు సరైన ప్రతిపాదనలు రూపొందించాలని అధికారులకు సూచించారు. రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పుష్కర ఘాట్లకు చేరుకునే రూట్‌లో రహదారుల మరమ్మత్తు పనులకు సంబంధించిన ప్రతిపాదనలు రూపొందించాలని తెలిపారు. నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల వద్ద స్నానపు ఏర్పాట్లు, భక్తుల సౌకర్యార్థం మెట్ల ఏర్పాట్లకు సంబంధించిన పనుల ప్రతిపాదనలు తయారు చేయాలని తెలిపారు. మున్సిపల్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టే పారిశుద్ధ్యం, ఫుట్ పాత్, లైటింగ్ ఏర్పాట్లకు సంబంధించి ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పుష్కర ఘాట్ల వద్ద అవసరమైన లైటింగ్ కొరకు విద్యుత్ స్తంభాలు, విద్యుత్



తీగల ఏర్పాటు కొరకు అవసరమైన ప్రతిపాదనలు అందించాలని తెలిపారు. అనంతరం జిల్లా కేంద్రంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి పుష్కర ఘాట్ ప్రాంతాన్ని అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో ఒత్తిడికి చెక్.. సంపూర్ణ ఆరోగ్యం మెండు



■ పాఠశాలల్లో విధిగా యోగా సాధన చేయించాలి
■ 'వన్ ఎర్త్ - వన్ హెల్త్' నినాదంతో కలెక్టర్ హరిత యోగాసనాలు

**ఆసిఫాబాద్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఒత్తిడిని సమర్థవంతంగా జయించవచ్చని జిల్లా కలెక్టర్ కె. హరిత అన్నారు. శుక్రవారం యోగ ఫర్ వన్ ఎర్త్-వన్ హెల్త్ నినాదంతో కలెక్టరేట్ ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నేటి వేగవంతమైన జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, అనారోగ్య సమస్యలకు యోగా ఒక సమగ్ర పరిష్కారమని అన్నారు. యోగా కేవలం వ్యాయామ పద్ధతి మాత్రమే కాకుండా ఆరోగ్యకరమైన జీవన విధానమని, దీన్ని ప్రతిరోజూ ఆచరించడం ద్వారా శరీరానికి దృఢత్వం, మనసుకు ప్రశాంతత లభిస్తాయని అన్నారు. యోగా ద్వారా రోగనిరోధక శక్తి పెంపొందడమే కాకుండా జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని అన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభించడం వల్ల వ్యక్తిగతంగా మాత్రమే కాకుండా కుటుంబం, సమాజం మొత్తానికి సానుకూల ప్రభావం ఉంటుందని అన్నారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి యోగా కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. జిల్లాలో యోగా పట్ల అవగాహన పెంపొందించేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని చిన్న వయస్సు నుంచే యోగా అలవాటు చేయడం అత్యంత అవసరమని తెలిపారు. యోగా సాధన వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక స్థిరత్వం పెరుగుతాయని అన్ని అన్నారు ఈ నేపథ్యంలో జిల్లాలోని ప్రతి పాఠశాలలో ఉదయం పాఠాలు ప్రారంభానికి ముందు యోగా నిర్వహణను చేపట్టాలని అన్నారు .ఈ కార్యక్రమంలో ఆర్డీవో లోకేశ్వర్ రావు, డీఆర్డీఓ దత్తారావు, వైద్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులు కావలెను

ప్రభాత సమాచారం
ఆదిలాబాద్ Digital Edition
మంచిర్యాల - కొమురం భీం ఆసిఫాబాద్ - నిర్మల్

తెలుగులో తప్పులు లేకుండా రాయగలిగి సామాజిక స్పృహతో స్పందించే ఉత్సహం, అవినీతి, అక్రమాలు వెలికితీసే ధైర్యం, ప్రశ్నించే తత్వం ప్రజా సమస్యలను వెలికితీసి పాత్రికేయ వృత్తిలో రాణించాలనే ఆసక్తి మీలో ఉందా.. ఆ అవకాశాన్ని ప్రభాత సమాచారం దినపత్రిక కల్పిస్తుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాలోని మండల కేంద్రాల్లో, నియోజకవర్గ, జిల్లా కేంద్రాల్లో విలేకరులుగా పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.

సయ్యద్ కరీం, ఎడిటర్ - ప్రభాత సమాచారం తెలుగు దినపత్రిక

9440977660, 9110718194

PRABHATHASAMACHARAM.COM
TELANGANA TELUGU DAILY


# మత విద్వేషాలకు 'చెక్'

■ ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్లు డిలీట్
■ రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తప్పవు
■ శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి
■ నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల హెచ్చరిక

**ముథోల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**



గత కొంతకాలంగా భైంసా పట్టణంలో కొంతమంది దుండగులు తప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్లను సృష్టించి, మార్ఫ్ చేసిన వీడియోలు మత విద్వేషాలకు దారితీసే పోస్టులు రెండు వర్గాల మధ్య ఉద్రిక్తతలు రెచ్చగొట్టే విధంగా ప్రచారం చేస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో పలువురి పై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ జానకి షర్మిల ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞా నాన్ని వినియోగిస్తూ, రెండు తప్పుడు ఫేస్‌బుక్ అకౌంట్లను గుర్తించి, ఆ రెండు ఫేస్ బుక్ అకౌంట్‌లను తొలగించడం జరిగిందని, త్వర లోనే అట్టి అకౌంట్లను నిర్వహిస్తున్న వ్యక్తులను గుర్తించి, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలు ఎవరైనా సోషల్ మీడియాలో అనుమానాస్పద, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అం దించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మకూడదని, శాంతి భద్రతలను కాపాడేందుకు సహకరించాలని ఈ సందర్భంగా తెలియజేశారు.



# ఐటీడీఏ పండ్ల తోటలకు 'మెగా వేలం'

■ మూడేళ్ల కాలపరిమితికి ఒకేసారి వేలం పాట
■ ఈనెల 16న ఉట్నూరు పీవో కార్యాలయంలో నిర్వహణ

**ఉట్నూర్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

ఐటీడీఏ ఉట్నూరు పరిధిలోని వివిధ ఉద్యాన నర్సరీలలో ఉన్న పండ్ల తోటలకు ఈ నెల 16న భారీ బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి (పీవో) యువరాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. గతానికి భిన్నంగా ఈసారి ఒకేసారి మూడేళ్ల కాలపరిమితికి (2026-2029) కలిపి ఈ మెగా వేలం పాట నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ వేలం పాటలో ప్రధానంగా మామిడి, సపోటా పంటలకు సంబంధించిన తోటలు ఉంటాయని పీవో వివరించారు. ఉట్నూరుతో పాటు ఆసిఫాబాద్ జిల్లాలోని జంబుగా, రాజంపేట, మంచిర్యాల జిల్లాలోని భీమారం మరియు బెల్లంపల్లి ప్రాంతాల్లోని ఐటీడీఏ తోటలకు ఈ వేలం నిర్వహించనున్నారు. నిర్దేశిత ప్రాంతాల్లోని తోటలను దక్కించుకోవాలనుకునే వారు ఈనెల 16న ఉదయం ఉట్నూరులోని ఐటీడీఏ పీవో కార్యాలయానికి హాజరుకావాలని కోరారు. వేలం పాట నిబంధనలు, ధరావత్తు, ఇతర వివరాల కోసం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఉమ్మడి జిల్లాలోని ఉద్యాన రైతులు, వ్యాపారులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## మొక్కజొన్న కొనుగోలు

# కేంద్రాలు ఏర్పాటు చేయించండి

**నిర్మల్, ఏప్రిల్ 10 (ప్రభాత సమాచారం)**

నిర్మల్ నియోజకవర్గంలో మొక్కజొన్న, జొన్న పంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి కూచాడి శ్రీహరి రావు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో మొక్కజొన్న పంటను విస్తారంగా రైతులు సాగు చేశారని కొనుగోలు కేంద్రాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మొత్తం పది కేంద్రాలు ఏర్పాటు చేస్తే రైతులకు శ్రేయస్కరంగా ఉంటుందని పేర్కొన్నారు. స్పందించిన మంత్రి మొదటి విడతగా నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ యార్డులలో కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జొన్న పంట కొనుగోలు రాష్ట్రంలో ఎక్కడ కేంద్రాలు ప్రారంభించలేదని, త్వరలోనే నిర్మల్ జిల్లాలో జొన్న పంట కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతుల పక్షాన రాష్ట్ర మంత్రికి శ్రీహరి రావు ధన్యవాదాలు తెలిపారు.

